భక్తజన సాగరం.. బడా గణేశ్ ప్రాంగణం

హైదరాబాద్ పెన్ పవర్: : రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న ఖైరతాబాద్ బడా వినాయకుడి చెంతకు భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావడంతో సుమారు 3 లక్షల మంది తరలివచ్చారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే కరవు: ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్ పెన్ పవర్: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కరవు ఏర్పడిందని.. వరి చివరి దశలో నీరు, విద్యుత్తు అందక పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా కనగల్ మండలం తేలకంటిగూడెంలో ఎండిపోయిన వరిపొలాన్ని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి ఆదివారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం తేలకంటిగూడెం విద్యుత్తు సబ్‌స్టేషన్, కనగల్‌లోని మైలసముద్రం చెరువును పరిశీలించారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాజకీయ విమర్శలు, ఇతర వివాదాల కంటే పంటలు ఎండిపోతున్న రైతుల సమస్యలే అత్యంత ముఖ్యమన్నారు. నాగార్జునసాగర్‌లో తగినంత నీరు ఉండి ఏఎమ్మార్పీ మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా కుట్ర పూరితంగా నీటిని విడుదల చేయకపోవడంతోనే పంటలు ఎండిపోతున్నాయన్నారు. రైతుల దుస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు స్పందించాలని కోరారు.

భక్తి పారవశ్యంలో... వారాల వినోద్ కుమార్

గణనాథునికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు,హారతి సమర్పణ..!

- సాయిబాబా నగర్ 292 డివిజన్ వ్యాప్తంగా విస్తృత పర్యటన..
- పలు వినాయక మండపాల్లో వారాల వినోద్ కుమార్ ప్రత్యేక పూజలు..
- భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించిన వినోద్ కుమార్..
- మండప నిర్వాహకుల ఆహ్వానం మేరకు హాజరైన వారాల..
- ఘన స్వాగతం పలికిన మండపాల కమిటీ.. శాలువాలతో ఘన సత్కారాలు..

-4లో

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 20: వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా 292వ డివిజన్ సాయిబాబా నగర్, సూరారం కాలనీతో పాటు పలు బస్తీలలో గణేష్ మండపాల సందడి నెలకొంది.. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు, బస్తీ ప్రతినిధుల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమ నేత వారాల వినోద్ కుమార్ వరుసగా రెండు రోజుల పాటు పలు గణేష్ మండపాలను సందర్శించారు. ఆయా మండపాల వద్ద నిర్వాహకులు, స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించారు..

సింగరేణి స్థలాల్లో స్థిర నివాసం ఉన్నవారికి పట్టాలు: శ్రీధర్‌బాబు

హైదరాబాద్ పెన్ పవర్: గోదావరిఖని, మంచిర్యాల, మందమర్రి, ఖమ్మం జిల్లా కొత్తగూడెం, ఇల్లెందు ప్రాంతాలకు సంబంధించి సింగరేణి స్థలాల్లో స్థిర నివాసం ఏర్పరచుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఆదివారం మంథని పట్టణంలోని రావుల చెరువు కట్ట హనుమాన్ ఆలయంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో భట్టి విక్రమార్క సింగరేణి ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పరచుకున్న వారి పట్టాలను క్రమబద్ధీకరించారని గుర్తుచేశారు. ఇంకా మిగిలిన వారి స్థలాలకు సంబంధించి కమిటీ ఏర్పాటు చేసుకొని పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

గణేశ్ నిమజ్జనం.. హెలికాప్టర్‌తో పూలవర్షం

హైదరాబాద్ పెన్ పవర్: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో నిమజ్జనం సందర్భంగా వినాయకుడి విగ్రహంపై హెలికాప్టర్‌తో పూల వర్షం కురిపించారు. గరిడి గణపతి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన హెలికాప్టర్‌తో పూలవర్షం కురిపించారు. పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి నుంచి ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వేలాదిమంది తరలివచ్చారు. ఏడు రోజులుగా పట్టణంలో వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి వినాయక విగ్రహాల శోభాయాత్ర మొదలైంది. ఈ సందర్భంగా భక్తులు కోలాటాలు, నృత్యాలతో సందడి చేశారు.

- మిగతా 5లో...

బౌరంపేట్‌లో గోనె కృష్ణారెడ్డి కుటుంబం గణనాథుని లడ్డూ వేలంలో కైవసం..

గణనాథుని లడ్డూలకు లక్షల్లో వేలం..!

- గణనాథుని లడ్డూలకు భారీ డిమాండ్.. లక్షల్లో పలికిన ధరలు..
- మూడు ప్రాంతాల్లో ఘనంగా పూజలు అందుకున్న వినాయకులు..
- భక్తిశ్రద్ధల మధ్య హోరాహోరీగా లడ్డూ వేలంపాటలు..

-5లో

- బౌరంపేట్ సుకృతి హోమ్స్ గోనె కృష్ణారెడ్డి రూ.5.55 లక్షలకు లడ్డూ కైవసం..
- నిజాంపేట బెవర్లీ పామ్స్‌లో మోచర్ల కుటుంబ సభ్యులు లడ్డును సొంతం..
- రామచంద్రరావు, ఆదిలక్ష్మి దంపతుల పేరిట రూ.2.81 లక్షలకు లడ్డూ కైవసం..
- సుచిత్ర గోకుల్ గార్డెన్స్‌లో, వడ్లమూడి ప్రకాశ్ రూ.31,011 వేలకు లడ్డూ సొంతం..
- గణనాథుని ప్రసాదమే మహాభాగ్యం అంటూ మూడు చోట్లా భక్తిశ్రద్ధల మధ్య ఉత్సాహంగా వేలంపాటలు..

బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలి

జాతీయ సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ పెన్ పవర్: బీసీల జనాభాను శాస్త్రీయంగా లెక్కించి.. వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించేందుకు దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. జనాభా లెక్కల్లో ప్రత్యేకంగా ఓబీసీ కాలమ్‌ను చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారమిక్కడ 'ఓబీసీ జనాభా గణనపై కేంద్ర ప్రభుత్వ విధాన నిర్ణయాలు..

గణనాథునికి పూజలు నిర్వహించి, హారతి ఇస్తున్న బీఆర్ఎస్ నేత వారాల వినోద్ కుమార్..

భక్తి పారవశ్యంలో... వారాల వినోద్ కుమార్

గణనాథునికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు,హారతి సమర్పణ..!

- సాయిబాబా నగర్ 292 డివిజన్ వ్యాప్తంగా విస్తృత పర్యటన..
- పలు వినాయక మండపాల్లో వారాల వినోద్ కుమార్ ప్రత్యేక పూజలు..
- భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించిన వినోద్ కుమార్..
- మండప నిర్వాహకుల ఆహ్వానం మేరకు హాజరైన వారాల..
- ఘన స్వాగతం పలికిన మండపాల కమిటీ.. శాలువాలతో ఘన సత్కారాలు..

భక్తులకు అన్నప్రసాద పంపిణీలో.. వారాల వినోద్, రాజ్ కుమార్..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 20: వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా 292వ డివిజన్ సాయిబాబా నగర్, సూరారం కాలనీతో పాటు పలు బస్తీలలో గణేష్ మండపాల సందడి నెలకొంది.. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు, బస్తీ ప్రతినిధుల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమ నేత వారాల వినోద్ కుమార్ వరుసగా రెండు రోజుల పాటు పలు గణేష్ మండపాలను సందర్శించారు. ఆయా మండపాల వద్ద నిర్వాహకులు, స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించారు..

మండపం నిర్వహకులతో కిలిసి, గణేష్ మహరాజ్‌కు హారతి సమర్పిస్తున్న వారాల వినోద్..

మండపాల వద్ద ప్రత్యేక పూజలు, హారతులు..

సెప్టెంబర్ 19న సూరారం కాలనీలోని గణేష్ మండపాన్ని సందర్శించిన వారాల వినోద్‌కుమార్‌కు మండప నిర్వాహకులు, బస్తీ ప్రెసిడెంట్లు స్వాగతం పలికారు. అనంతరం 292 డివిజన్‌లోని పలు బస్తీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కారం చేసి, స్ర్వామివారి సాదం అందించారు.. రెండో రోజూ కొనసాగిన మండపాల పర్యటనలో వినోద్ కుమార్ సందడి చేశారు.. సెప్టెంబర్ 20న కూడా సాయిబాబా నగర్, సూరారం కాలనీతో పాటు పలు బస్తీలలోని గణేష్ మండపాలను వారాల వినోద్ కుమార్ సందర్శించారు. మండప నిర్వాహకులు, అసోసియేషన్ సభ్యులు, బస్తీ వాసులు ఆయనకు మర్యాదపూర్వకంగా ఆహ్వానం పలికారు.. గణేష్ విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.. అనంతరం స్వామివారి సన్నిధిలోని అన్న ప్రసాదం పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు..

నిర్వహకులకు వినోద్ కుమార్ కీలక సూచనలు..

సాయిబాబా నగర్ 292 డివిజన్ పరిధిలోని, పలు మండపాల నిర్వాహకులకు, వారాల వినోద్ కుమార్ కీలక సూచనలు చేశారు.. గణేష్ నవరాత్రుల సమయంలో అయినా.. నిమజ్జనం రోజు అయినా, పోలీసులు సూచించిన నిబంధనలు పాటించాలని అన్నారు.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, సంబంధిత మండపాల నిర్వాహకులే కీలక బాధ్యతలు చేపట్టాలని, బీఆర్ఎస్ నేత వారాల వినోద్ కుమార్ నిర్వాహకులకు పేరు పేరున సూచనలు చేశారు.. నిమజ్జనానికి ఊరేగింపు సమయంలో, రహదారుల్లో పాదచారులకు, వాహన దారులకు, ఇబ్బందులు తలెత్తకుండా, సహకరించాలని పేర్కొన్నారు.. భక్తిశ్రద్ధలతో గణనాథుని నిమజ్జన ప్రక్రియ ముగిసే విధంగా ఆయా మండపాల నిర్వాహకుల, బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు..

భక్తులతో కలిసి అన్న ప్రసాదం..

పలు మండపాల వద్ద నిర్వహించిన అన్న ప్రసాద కార్యక్రమాల్లో స్థానికులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారాల వినోద్‌కుమార్ కూడా భక్తులతో కలిసి అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొని, మండప నిర్వాహకులతో మాట్లాడారు. రెండు రోజుల పర్యటనలో పలువురు స్థానిక నాయకులు, బస్తీ ప్రతినిధులు ఆయన వెంట ఉన్నారు..

వినోద్ కుమార్ వెంట పాల్గొన్న నాయకులు..

రెండు రోజులుగా కొనసాగిన ఈ మండపాల సందర్శనలో వారాల వినోద్‌కుమార్‌కు స్థానిక మండప నిర్వాహకులు, బస్తీ ప్రతినిధులు అందించిన స్వాగతాలు, సత్కారాలు కార్యక్రమంలో ప్రత్యేకంగా నిలిచాయి.. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు రాజ్‌కుమార్ ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, తారా సింగ్, నారాయణ, వేణు ముదిరాజ్, అనిల్, రాజు యాదవ్, శివ, కరాటే శ్రీను, సత్యనారాయణ గౌడ్, కిషోర్ ముదిరాజ్, మహేష్ గౌడ్, మాజీద్ పాషా, పూర్ణచందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శంకర్, గణేష్, మల్లేష్, కైసర్ పాషా, నిరంజన్, ఏకలవ్య నగర్ ప్రెసిడెంట్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.. ఆయా బస్తీల ప్రతినిధులు, మండప నిర్వాహకులు, మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు..

బౌరంపేట్‌లో గోనె కృష్ణారెడ్డి కుటుంబం గణనాథుని లడ్డూ వేలంలో కైవసం..

సుచిత్ర గోకుల్ గార్డెన్స్‌లో లడ్డూను కైవసం చేసుకున్న వడ్లమూడి ప్రకాశ్..

గణనాథుని లడ్డూలకు లక్షల్లో వేలం..!

- ●గణనాథుని లడ్డూలకు భారీ డిమాండ్.. లక్షల్లో పలికిన ధరలు..
- ●మూడు ప్రాంతాల్లో ఘనంగా పూజలు అందుకున్న వినాయకులు..
- ●భక్తిశ్రద్ధల మధ్య హోరాహోరీగా లడ్డూ వేలంపాటలు..

- ●బౌరంపేట్ సుకృతి హోమ్స్ గోనె కృష్ణారెడ్డి రూ.5.55 లక్షలకు లడ్డూ కైవసం..
- ●నిజాంపేట బెవర్లీ పామ్స్‌లో మోచర్ల కుటుంబ సభ్యులు లడ్డును సొంతం..
- ●రామచంద్రరావు, ఆదిలక్ష్మి దంపతుల పేరిట రూ.2.81 లక్షలకు లడ్డూ కైవసం..
- ●సుచిత్ర గోకుల్ గార్డెన్స్‌లో, వడ్లమూడి ప్రకాశ్ రూ.31,011 వేలకు లడ్డూ సొంతం..
- ●గణనాథుని ప్రసాదమే మహాభాగ్యం అంటూ మూడు చోట్లా భక్తిశ్రద్ధల మధ్య ఉత్సాహంగా వేలంపాటలు..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 20: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సందర్భంగా మూడు వేర్వేరు ప్రాంతాల్లో లడ్డూ వేలంపాటలో భక్తులు రూ.లక్షల్లో పాటపాడి దక్కించుకున్నారు.. గణనాథులు ఘనంగా పూజలందుకున్న.. ఆయా వినాయక మండపాల్లో నిర్వహించిన లడ్డూ వేలంపాటలు భక్తులు ఉత్సాహంతో పోటాపోటీగా నిర్వహించారు.. వినాయకుని ప్రసాదంగా భావించే లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు పోటీపడటంతో పలు చోట్ల వేలం ధరలు లక్షల రూపాయలకు చేరాయి..

బౌరంపేట్ సుకృతి హోమ్స్‌లో

దుండిగల్ సర్కిల్ సిఎంసి పరిధిలోని బౌరంపేట సుకృతి హోమ్స్‌లో కొలువుదీరిన గణనాథుని నిమజ్జన ఊరేగింపు సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటలో గోనె కృష్ణారెడ్డి రూ.5,55,000 లకు లడ్డూను దక్కించుకున్నారు.. భారీ మొత్తానికి వేలం పలకడంతో సుకృతి హోమ్స్‌లో భక్తుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి..


నిజాంపేట్‌లో సొంతం చేసుకున్న లడ్డనూ తీసుకెళ్తున్న దృశ్యం..

నిజాంపేట్ బెవర్లీ ఫామ్స్‌లో..

నిజాంపేట్‌లోని బెవర్లీ పామ్స్‌లో నిర్వహించిన గణనాథుని లడ్డూ వేలంపాట కూడా ఘనంగా జరిగింది. ఇందులో విల్లా నంబర్ 28కు చెందిన మోచర్ల కుటుంబం రూ.2,81,000 లకు లడ్డూను కైవసం చేసుకున్నారు.. మోచర్ల రామచంద్రరావు, మోచర్ల ఆదిలక్ష్మి దంపతుల పేరిట లడ్డూను సొంతం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేలంపాటలో బెవర్లీ పామ్స్ నివాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

సుచిత్ర గోదావరీ హోమ్స్..

అదేవిధంగా సుచిత్ర సర్కిల్‌లోని గోదావరి హోమ్స్ గోకుల్ గార్డెన్స్‌లో జరిగిన లడ్డూ వేలంపాటలో వడ్లమూడి ప్రకాష్ రూ.31,011 లకు గణనాథుని లడ్డూను దక్కించుకున్నారు. భక్తులు, స్థానికుల సమక్షంలో ఉత్సాహ భరితంగా వేలంపాట సాగింది.. మూడు ప్రాంతాల్లోనూ భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుల లడ్డూలను ప్రసాదంగా సొంతం చేసుకునేందుకు భక్తులు ఆసక్తి చూపారు. వేలంపాటలు ఉత్సాహభరితంగా సాగడంతో ఆయా ప్రాంతాల్లో వినాయక ఉత్సవాల సందడిగా మారాయి..

నిజాంపేట్‌లో మోచర్ల దంపతులు..

బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలి

-3 పేజి తరువాయి

ఓబీసీల తక్షణ బాధ్యతలు, భవిష్యత్ కార్యాచరణ' అనే అంశంపై నిర్వహించిన జాతీయ ఓబీసీ సదస్సులో మంత్రి పొన్నం మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే.. కులగణన ప్రక్రియను పక్కాగా చేపట్టామన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని.. అయితే, బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయం చేకూర్చే విషయంలో 50 శాతం రిజర్వేషన్ పరిమితి అడ్డంకిగా మారకూడదని పొన్నం అన్నారు. వీహెచ్, ఎంపీ సురేశ్ షెట్కార్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, బీసీ జేఏసీ వర్కింగ్ ఛైర్మన్ గుజ్జ కృష్ణ, సభ సమన్వయకర్తలు టి.విక్రమ్‌గౌడ్, కె.శ్యామ్‌కురుమ, ప్రొ.సంఘని మల్లేశ్వర్, పీఎల్ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఏటీఎంలలో రూ.16 లక్షల చోరీ

హైదరాబాద్ పెన్ పవర్: కరీంనగర్ నేర వార్తలు: కరీంనగర్ (ఖుతీఅఎఖుస్త్రుతీ చీవషం) నగరానికి సమీపంలోని రెండు చోట్ల ఆదివారం తెల్లవారుజామున దొంగలు బీభత్సం సృష్టించారు. ఎస్‌బీఐకి చెందిన ఏటీఎంలను ధ్వంసం చేసి దాదాపు రూ.16 లక్షలు చోరీ చేశారు. రెండు ఏటీఎం కేంద్రాలు రాజీవ్ రహదారిపైనే ఉండటం గమనార్హం. సీసీ కెమెరాలకు నలుపు రంగు స్ప్రే కొట్టి, గ్యాస్ కట్టర్‌లతో యంత్రాలను ధ్వంసం చేసి డబ్బు దోచుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారుజామున 2.40 నుంచి 3 గంటల మధ్య రాజీవ్ రహదారిపై తిమ్మాపూర్ స్టేజీ వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు దుండగులు చేరుకున్నారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన అనంతరం ఏటీఎంలోని నాలుగు ట్రేలలో ఉంచిన రూ.7,13,400 నగదు దోచుకున్నారు.అక్కడి నుంచి సుమారు 16 కిలోమీటర్ల దూరంలోని కరీంనగర్ గ్రామీణ మండలం దుర్శేడు స్టేజీ వద్ద ఉన్న మరో ఏటీఎం వద్దకు 3.30 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. ఏటీఎం కింది భాగాన్ని అత్యాధునిక గ్యాస్ కట్టర్ల సాయంతో తొలగించారు. అందులోని సుమారు రూ.8,55,000 నగదు అపహరించారు. ఒక్కో ఏటీఎం వద్ద కేవలం ఏడు నిమిషాల్లోనే చోరీ పూర్తి చేసినట్లు పోలీసులు తెలిపారు. దుర్శేడు ఏటీఎం వద్ద దొంగలు ప్రయాణించిన ఎంహెచ్ 03 ఈబీ 4258 నంబరు స్కార్పియో వాహనం సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది. మొత్తం ముగ్గురు దుండగులు చోరీకి పాల్పడినట్లుగా భావిస్తున్నారు. ఇందులో ఓ వ్యక్తి, ముఖానికి మాస్కు ధరించి మహిళ వేషధారణలో ఉన్నాడు. తమ కదలికలు తెలియకుండా ఏటీఎం వెలుపల, లోపల ఉన్న సీసీ కెమెరాలకు నలుపు రంగు స్ప్రే కొట్టడం అందులో నిక్షిప్తమైంది. రెండు చోట్ల చోరీల తీరును గమనిస్తే పక్కా ప్రణాళికతో రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇది అనుభవం ఉన్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా పనిగా పోలీసులు అనుమానిస్తున్నారు. చోరీ అనంతరం దుండగులు పెద్దపల్లి వైపు పరారయ్యారు. దుర్శేడు ఏటీఎం వద్ద దొంగలు చోరీ చేస్తున్నప్పుడు

తెల్లవారుజామున 3.40 గంటలకు దిల్లీలోని ఏటీఎం నియంత్రణ ప్రధాన కార్యాలయానికి సమాచారం వెళ్లింది. అక్కడి నుంచి వచ్చిన సూచనల మేరకు బ్యాంకు అధికారులు 4 గంటలకు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా 10 నిమిషాల్లోనే ఏటీఎం వద్దకు చేరుకున్నారు. తిమ్మాపూర్ ఏటీఎం వద్ద చోరీ చేస్తున్నప్పుడు నియంత్రణ ప్రధాన కార్యాలయానికి సమాచారం వెళ్లకపోగా 5.30 సమయంలో ఉదయపు నడకకు వచ్చిన కొంతమంది ఏటీఎం ధ్వంసం కావడం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిమిషాల వ్యవధిలో రెండు ఏటీఎంలలో దొంగలు నగదు చోరీకి పాల్పడటంతో కరీంనగర్ ఉలిక్కిపడింది. పోలీసులు నాలుగు బృందాలను ఏర్పాటు చేసి, సీసీ టీవీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇటీవలి కాలంలో జిల్లాలో చోటుచేసుకుంటున్న భారీ చోరీ ఘటనలు పోలీసులకు సవాల్‌గా మారాయి.

వరంగల్ లాల్ బహదూర్ కళాశాల ఆధ్వర్యంలో రెండవ రోజు ప్రత్యేక శిబిరం

హైదరాబాద్ పెన్ పవర్: వరంగల్ లాల్ బహదూర్ కళాశాల ఆధ్వర్యంలో రెండవ రోజు (ఎన్ ఎస్ ఎస్) వాలంటీర్లు. కాకతీయ విశ్వ విద్యాలయం ఆడిటోరియం పరిసరాలను పరిశుభ్రం చేసినారు . ఎస్ డి ఎల్ సి ఈ విశ్వవిద్యాలయం నుండి వైస్ ఛాన్సలర్ భవనానికి పోయేవారికి ఇరువైపులా ఉన్నటువంటి పనికిరాని మొక్కలను తొలగించడం జరిగింది. మధ్యాహ్నం అవగాహన సదస్సు లో. భాగంగా డాక్టర్. మోరే. అశోక్. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఉద్దేశించి జాతీయ సేవా పథకం ఆవిర్భావం జాతీయ సేవా పథకం లోగో దాగి ఉన్న నిగూడ అర్ధాన్ని వివరించి విద్యార్థి విద్యార్థులను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమానికి. ఎన్ఎస్ఎస్. కోఆర్డినేటర్. ప్రో. ; ఈసం. నారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసినారు ఈ కార్యక్రమంలో లాల్ బహదూర్ కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ స్. డా ; ఏ. రాఘవేందర్ రెడ్డి హింగే. రాజేశ్వరరావు ఉమ్మ గాని. శ్రీనివాస్ ఎన్ఎస్ఎస్. విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు .

జనగామ జిల్లా పాలకుర్తిలో శివ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా మహా అన్న ప్రసాద వితరణ

హైదరాబాద్ పెన్ పవర్:

:పాలకుర్తి
మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామి టెంపుల్ కాలనీలో శివ గణేష్ యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు కామారపు సునీల్, కమ్మగాని సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరై అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అన్నదానం మహాదానం అని, ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు.

ఈ కార్యక్రమంలో శివ గణేష్ యూత్ కమిటీ అధ్యక్షులు జిట్టబోయిన కుమార్, ఉపాధ్యక్షులు ఎ.పాషా సభ్యులు కత్తుల అశోక్, కత్తుల సోమన్న, మాసాని రాజు, కత్తుల రాజు,అనుముల మహేందర్, వేణు, శ్రీకాంత్, లగ్గాల సుధాకర్, ఎలుక బన్నీ, అనుముల రాజు,యువత, స్థానిక భక్తులు మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తి, సేవా స్ఫూర్తితో నిర్వహించిన ఈ మహా అన్నదాన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.

వేల్పుగొండలో హెరిటేజ్ వాక్

- చారిత్రక కట్టడాలను సందర్శించిన పర్యటకులు
- నిరుడి దాసు వేల్పుగొండ సర్పంచ్

హైదరాబాద్ పెన్ పవర్:

20) ఉమ్మడి మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం లోని టేక్మాల్ మండల పరిధిలోని వేల్పుగొండ గ్రామంలో కాకతీయుల కాలం నాటి శ్రీ తుమ్మరేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం 'మెతుకుసీమ వైభవం' ఆధ్వర్యంలో బుర్ర సంతోష్ పర్యవేక్షణలో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఆలయంలో వెలిసినటువంటి స్వయంభు లింగేశ్వరుని విగ్రహానికిఅర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ తుమ్మరేశ్వర స్వామి ఆలయ చారిత్రాత్మకమైన ప్రాదన్యాన్ని పర్యాటక బృందానికి వివరించి ప్రాంతంలోని చారిత్రాత్మక పురావస్తు సాంస్కృతిక సంపదను భావితరాలకు పరిచయం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీరుడి దాసు, ఉప సర్పంచ్ ఎంపీ సుధాకర్, సిటిజన్స్ ఫోరమ్ అధ్యక్షులు కొండల్ రెడ్డి, పర్యాటక బృందం సభ్యులు, గ్రామ పెద్దలు లింగమయ్య, తుపాకీ ఆంజనేయులు, అబ్బనీ ప్రకాష్, మోహన గారి యాదగిరి, చకినాల రాజు, కళాలి సాకేత్ గౌడ్, మూడ వెంకటేశం, అంజయ్య, జట్టిగారి సాయిలు, మూడ అంజయ్య, బోయిని శ్రీకాంత్, దాసరి నాగరాజు, రాములు, దుర్గయ్య తదితరులు ఉన్నారు

రైలు పట్టాలు దాటుతుండగా ఓ వ్యక్తిపై దూసుకొచ్చిన గూడ్స్ రైలు

- తీవ్ర గాయాలతో హాస్పిటల్ కి తరలింపు
- చికిత్స పొందుతూ ఎంజీఎం లో వ్యక్తి మృతి
- మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు
- వివరాలు తెలిసిన కు సమాచారం అందించాలని పోలీసు వారి విజ్ఞప్తి

హైదరాబాద్ పెన్ పవర్: వరంగల్ జి ఆర్ పి. సి ఐ శ్రీ వి నరేష్ కుమార్ కథనం ప్రకారం పై ఫోటో లోని మగ వ్యక్తి వయసు అందాదా 60 సంవత్సరాలు గల వ్యక్తి తేదీ 08-09-2026 ఉదయం 11:30 గంటల సమయాన అబ్బని కుంట మైసమ్మ దేవాలయం చింతల్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి క్రింద గల రైల్వే ట్రాక్పై కె ఎం. నెంబర్. 377/. సి 23- సి. 25 బి డి. లైన్ చింతలపల్లి వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలు దాటుతుండగా బి డి. లైన్ పై వెళ్ళు పి ఎస్ ఎన్ హెచ్ గూడ్స్ రైలు బండి ఢీ కొనడం వలన తీవ్ర గాయాలతో ట్రాక్ పక్కన పడి ఉండగా 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం. హాస్పిటల్కు తరలించగ ఎమర్జెన్సీ వార్డు నందు చికిత్స పొందుతూ నిన్నటి రోజు రాత్రి 9:10 పి .ఎం. సమయాన చనిపోయినాడు.(మృతుడి పేరు ఏలియా అని తను వరంగల్ గరీబ్ నగర్ కాలనీకి చెందిన ఆరూరి సాంబయ్య వద్ద కొబ్బరి బోండాల దుకాణంలో పనిచేసినట్లుగా తెలిసినది) మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు గాని గుర్తింపు పత్రాలు గాని లేవు. ఇట్టి కేసును వరంగల్ జి ఆర్ పి. సి ఐ ఉత్తర్వుల మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కె. భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏమైనా వివరాలు తెలిసినాచో 9440361941 8712658627 తెలియపరచగలరు

ఉమ్మడి జిల్లాలో ఆందోల్ నియోజకవర్గనికి టేక్మాల్ మండల బీజేపీ నేతలకు కీలక పదవులు

- మెదక్ జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడిగా మోహన్ నాయక్..
- సంగారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యునిగా వడ్డే రాములు..



హైదరాబాద్ పెన్ పవర్:

ఉమ్మడి మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం లోని టేక్మాల్ మండలానికి కీలక పదవులు అని మండలానికి చెందిన బీజేపీ నాయకులకు ఉమ్మడి జిల్లాలో పార్టీ పరంగా కీలక బాధ్యతలు దక్కాయి. మెదక్ జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడిగా మోహన్ నాయక్, సంగారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా వడ్డే రాములు నియమితులయ్యారు. పార్టీ అధిష్టానం తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మోహన్ నాయక్, వడ్డే రాములును మెదక్ జిల్లా లేబర్ సెల్ కన్వీనర్ నాయికోటి శ్యామయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతలు పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపాయని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయికోటి శ్యామయ్య మాట్లాడుతూ టేక్మాల్ మండలానికి చెందిన నాయకులకు ఉమ్మడి జిల్లాలో పార్టీ పరంగా బాధ్యతలు రావడం సంతోషకరమైన విషయమన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, మండలంలోని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. నూతనంగా నియమితులైన మోహన్ నాయక్, వడ్డే రాములు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తామని చెప్పారు. టేక్మాల్ మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలతో కలిసి కృషి చేస్తామని తెలిపారు. మోహన్ నాయక్ ఎస్టీ మోర్చా ద్వారా గిరిజన ప్రాంతాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, వడ్డే రాములు రైతులకు సంబంధించిన సమస్యలను పార్టీ వేదికల ద్వారా ప్రస్తావిస్తూ రైతుల సంక్షేమం కోసం పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నూతన బాధ్యతలు పొందిన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా లేబర్ కన్వీనర్ నాయికోటి శామయ్య, ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు సిద్ధి రాములు, టేక్మల్ మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు శంకర్, బీజేవైఎం జిల్లా సెక్రెటరీ మదన్ రెడ్డి,మండల్ జనరల్ సెక్రెటరీ సేనపతి, జనరల్ సెక్రెటరీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అందరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని, సమాజం పట్ల గౌరవంతో బాధ్యతతో మెలగాలీ..

హైదరాబాద్ పెన్ పవర్:

. ఉమ్మడి మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం లోని టేక్మాల్ మండలంలో ధన్నూరా గ్రామం లో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మరియు కుసంగి గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్, మండల యువజన కాంగ్రెస్ నాయకులు టేక్మాల్ మండల పరిధిలోని ధనూర గ్రామంలో శ్రీరామ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథున్ని ఆదివారం మండల యువజన కాంగ్రెస్ నాయకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గణనాథుని మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాత ఫర్టిలైజర్ యాజమాన్యం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని శ్రీరామ యూత్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిద్దు, కుసంగి ఉప సర్పంచ్ సుబ్బారావు, యువజన కాంగ్రెస్ నాయకులు సంగమేశ్వర్, ప్రవీణ్, శ్రీకాంత్, వెంకట్ గౌడ్, రమేష్ గౌడ్, వెంకట్, శ్రీరామ యూత్ సభ్యులు అంజయ్య, దత్తు, రమేష్, వెంకటేశం, అశోక్, రమేష్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్ పెన్ పవర్:

గుంటూరు పట్టణంలోని తన్వి హోటల్లో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ షూటింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం , ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలకు పరిశీలకులుగా స్పోర్ట్స్ అథారిటీ ఆంధ్ర ప్రదేశ్ నుంచి గుంటూరు క్రీడల అభివృద్ధి అధికారి అఫ్రోజ్ ఖాన్ హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా అడ్వకేట్ సునీత , ఫెడరేషన్ అబ్జర్వర్ ఐలయ్య ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎం. కిరణ్ కుమార్ (నంద్యాల జిల్లా) , రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వి. సాహిత్య కృష్ణ (పల్నాడు) బి. సంతోష్ కుమార్ (నెల్లూరు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగరాజు (కర్నూలు) రాష్ట్ర కోశాధికారిగా కిషోర్ కుమార్ (విశాఖపట్నం) జాయింట్ సెక్రెటరీగా పరమేశ్వర్ రెడ్డి (నంద్యాల) ప్రియాంక (ఏలూరు) కార్యవర్గ సభ్యులుగా హనీత్ నాగ్ (ఎన్టీఆర్) వినీత (తిరుపతి) ఎంపికైనట్టు తెలియజేశారు. ఈ కార్యవర్గం 2030 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు షూటింగ్ బాల్ క్రీడాభివృద్ధి కొరకు కృషి చేస్తామని ప్రమాణ స్వీకారం చేశారు.

శ్రీ పరివార్ సాధన సేవా సమితి కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడిగా నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు బండి నరేష్
- ప్రధాన కార్యదర్శి అమ్మ మల్లయ్య, కార్యదర్శి చల్ల అరుణ
- కోశాధికారి బుడుగొండ కుమారస్వామి

హైదరాబాద్ పెన్ పవర్: శ్రీ పరివార్ యోగ సాధన సేవా సమితి తొగర్రాయి,గిర్నిబావి గ్రామాల ఉమ్మడి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని గిర్నిబావిలో శ్రీపరివార్ సాధన సేవా సమితి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొమ్మ నారాయణ రెడ్డి,ఉపాధ్యక్షుడిగా బండి నరేష్, ప్రధాన కార్యదర్శిగా అమ్మ మల్లయ్య,కార్యదర్శి చల్ల అరుణ, కోశాధికారిగా బుడుగొండ కుమారస్వామి,ప్రచార కార్యదర్శిగా మండల శంకరయ్య,అలువాల రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా బండారి రవీందర్, కలువాల సురేందర్,బుడుగొండ అశోక్,అలువాల కళ్యాణి,బండి అనిత,బండి నాగరాణి,కలువాల దేవేంద్ర,అమ్మ వినోద,బండారి రమాదేవి,మండల మహేందర్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బొమ్మ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. శ్రీ పరివార్ సంస్థ ద్వారా యోగను గ్రామీణ స్థాయిలో మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుత సమాజం అనేక కోణాల్లో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని, దానిని అధిగమించాలంటే కేవలం యోగ ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగను భాగం చేసుకుంటే.. ఆరోగ్యకరమైన జీవితాన్ని, ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని పొందొచ్చని వెల్లడించారు. అందరికీ ఆరోగ్యాన్ని యోగ ద్వారా అందించే లక్ష్యంతో పని చేయనున్నట్టు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి యోగాచార్యులు సదానందం గౌరోజు అధ్యక్షత వహించగా.. రాస రాజు,రాస అశోక్,పెండ్లి శ్రీను,కొక్కరగొండ అశోక్,హైమ,పెండ్లి సుజాత, బండి రాజు, యార మహేందర్,నరిగె కుమారస్వామి,తదితరులు పాల్గొన్నారు.

ఆహుతి. పుస్తక విమోచనం

హైదరాబాద్ పెన్ పవర్:

నేడు ప్రజ్ఞాభారతి వరంగల్ వారి ఆధ్వర్యంలో నక్సల్స్ పోరులో ప్రాణాలు కోల్పోయిన త్యాగదనుల గాధలను ఆధారంగా చేసుకొని వ్రాయబడిన "ఆహుతి" పుస్తక విమోచనం హనుమకొండలోని సామా జగన్మోహన్ స్మారక భవనం (ఏబీవీపీ భవనం) నందు సీనియర్ జర్నలిస్ట్ రాకా సుధాకర్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగినది. అలాగే ఇట్టి కార్యక్రమంలో కొరిగింజ రామచంద్రయ్య (వనవాసి కళ్యాణ పరిషత్ ప్రశిక్షకులు), చామర్తి ప్రభాకర్ (ప్రజ్ఞా భారతి రాష్ట్ర ఉప కార్యదర్శి, అడ్వకేట్) , బూరా రమేష్ (ప్రజ్ఞా భారతి వరంగల్ కో కన్వీనర్ ఽ రిటైర్డ్ ప్రిన్సిపల్) అప్పట్లో నక్సల్స్ కి ధైర్యంగా ఎదురొడ్డి నిలిచిన జాతీయవాది మచ్చుపాడ్ గ్రామవాసి నరహరి, డాక్టర్ ప్రభాకర్ రెడ్డి (మణిపూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్), మాజీ మేయర్ రాజేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, శేషారెడ్డి, ప్రజ్ఞాభారతి కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా తీవ్రవాదాన్ని ఎదిరించి సమాజంలో దేశభక్తిని, జాతీయత వాదాన్ని విస్తరింప చేయడంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తలు, దేశభక్తులు ప్రాణాలు అర్పించి భారత జాతీయతని సజీవంగా నిలిపారని ఆ కారణంగానే నేడు భారతీయత విశ్వవ్యాపితం అవుతుందని రాక సుధాకర్ అన్నారు. తీవ్రవాది పిరికివాడని అందుకే ఆయుధాన్ని ధరిస్తాడని, కాల గమనంలో వారి సిద్ధాంతం అంతరిస్తుందని చరిత్ర రుజువు చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా మరుగుదపడిన ఎందరో త్యాగధనుల దేశభక్తుల సమగ్ర సమాచారంతో

ఇలాంటి సాహిత్యం ముందు ముందు ముద్రించడం ద్వారా రాబోయే తరాలకు ఆదర్శంగా నిలుస్తుంది అని వారన్నారు. రామచంద్రరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆనాడు ఎందరో దేశభక్తులు స్వయం సేవకులు గ్రామాలలో, నగరాల్లో నక్సల్వా దానికి వ్యతిరేకంగా చేసిన పోరాటాలు సామా జగన్మోహన్ త్యాగాన్ని గుర్తు చేశారు

కారు ప్రమాదంలో వైద్యుడి సజీవ దహనం

ఖమ్మం, పెన్ పవర్, సెప్టెంబర్ 20: సూర్యాపేటలో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. విజయవాడ–హైదరాబాద్ హైవే మీద ఉన్న పిల్లలమర్రి సమీపంలో ఈ ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓల్వో కారు డివైడర్ ఢీకొనడంతో కారులో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో కారులో ప్రయాణిస్తున్న ఖమ్మం మమత హాస్పిటల్ కు చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ కాసుకుర్తి జగదీష్ సజీవ దహనమయ్యారు. ప్రమాదంలో డాక్టర్ కాసుకుర్తి జగదీష్ మరణించడంతో పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రమాదంలో మరణించిన డాక్టర్ కాసుకుర్తి జగదీష్(ఫైల్)

పిడుగుపాటుకు పేలిన రెండు సెల్‌ఫోన్లు

హైదరాబాద్ పెన్ పవర్: మండలంలోని బొప్పాజీవాడి గ్రామానికి చెందిన సూర్యకాంత్, బూర్గల్ గ్రామానికి చెందిన గైని శంకర్‌లకు చెందిన సెల్‌ఫోన్లు పిడుగుపాటుకు గురై వారి జేబులోనే పేలిపోయాయి. ఆదివారం మధ్యాహ్నం వీరిద్దరూ కలిసి వర్షం కురుస్తున్న సమయంలో ఒక గొడుగు కింద ఉన్నారు. ఈ క్రమంలో వారికి సమీపంలో పెద్ద శబ్దంతో పిడుగు పడటంతో వారి జేబులో ఉన్న సెల్‌ఫోన్లు ఒక్కసారిగా పేలిపోవడంతో వారిద్దరూ గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

ట్రెండింగ్ గా వెల్మల్ గణనాథులు

హైదరాబాద్ పెన్ పవర్: గణేష్ ఉత్సవాలు వచ్చాయంటే ఆ ఊరంతా పండగ వాతావరణం. గణపతి చూడాలన్న, డీజే సౌండ్ వినాలన్న జిల్లాలో ఏ మూలన ఉన్నా ఇక్కడికి రావాల్సిందే. ఇంతటి ప్రత్యేకత చూడాలంటే నిజామాబాద్ జిల్లా నందిపేట మండలంలోని వెల్మల్ గ్రామానికి రావాల్సిందే. భారీ ప్రతిమలను తీసుకొచ్చేటప్పుడు, తరలించేప్పుడు మార్గం మధ్యలో గ్రామాల స్వాగత తోరణాలు సైతం తొలగిస్తారు. ఇలా ప్రతి ఏటా ఒకటి, రెండు కాదు 30కి పైగా గణనాథులను దేశ నలుమూలల నుంచి తీసుకొచ్చి వరుసగా ఒకదాని పక్కన ఒకటి ఏర్పాటు చేయడం ఈ ఊరి ప్రత్యేకత. కులాలకు అతీతంగా పూర్వ విద్యార్థులు బ్యాచ్ ల వారీగా మండపాలను ఏర్పాటు చేసుకోవడం ఇక్కడ ఆనవాయితీ.గ్రామ యువత దేశ, విదేశాల్లో ఎక్కడ ఉన్న వచ్చి పాల్గొనడం పరిపాటి. అంతేకాదు ఊరేగింపు శోభయాత్ర విషయంలో డీజేలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. హైదరాబాద్, ముంబై, పూణే లాంటి నగరాల నుంచి డీజేలు రూ. లక్ష నుంచి రూ. 3 లక్షల వరకు వెచ్చించి తెస్తారంటే అతిశయోక్తి కాదు. వీటిని నిమజ్జన సమయంలో వీక్షించేందుకు ఎంతో మంది సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తారు. ప్రతి పండుగ ఉత్సవానికి ఇక్కడ కనీసం రూ. కోటి నుంచి రూ. కోటిన్నర వరకు ఖర్చు చేస్తారు. యువకులు ఎప్పుడు అభ్యంతరాలు, వివాదాలు లేకుండా ఉత్సవాలు ముగిస్తుండడంతో గ్రామపెద్దలు కూడా ప్రోత్సహిస్తున్నారు.

ఆత్మరక్షణకు కరాటే ఆయుధం : జీఎం రాధాకృష్ణ

హైదరాబాద్ పెన్ పవర్: ఆత్మరక్షణకు కరాటే సాధన ఆయుధం అని, ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని మందమర్రి సింగరేణి జీఎం రాధాకృష్ణ పిలుపునిచ్చారు. జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గం, బెల్లంపల్లి మండలంలోని సోమగూడెం త్రినేత్ర ఫంక్షన్ హాల్‌లో మాస్టర్ కుందేళ్ల రవి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 6వ రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ కరాటే పోటీలను మందమర్రి జీఎం రాధాకృష్ణ, కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, కమిటీ అధ్యక్షుడు మల్లేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సమావేశానికి వివిధ స్థాయిల మాస్టర్లు, విద్యార్థులు 600 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కరాటే శిక్షణ వల్ల పిల్లల్లో క్రమశిక్షణ పెరుగుతుందని, మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెంపొందుతుందని అన్నారు. ఆత్మరక్షణకు కరాటే సాధన ఆయుధం లాంటిదని అన్నారు. ఆటలతో పాటు చదువుకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ శిక్షణతో తల్లిదండ్రులకు, మాస్టర్లకు, మన ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. జిల్లా నుంచి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలు మన ప్రాంతంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. మాస్టర్ రవిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే శిక్షణ మాస్టర్లు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బీసీ సీఎం...ఈటెల చాన్స్ కొట్టేస్తారా ?

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణా రాజకీయాల్లో బీజేపీ దూసుకుని పోవాలని అనుకుంటోంది. అయితే ఎక్కడా అవకాశం అయితే కాంగ్రెస్ బీఆర్ఎస్ ఇవ్వడం లేదు, రెండు పార్టీలు గ్రౌండ్ లెవెల్ నుంచి గట్టిగా పాతుకుపోయిన పార్టీలు కావడంతో బీజేపీకి ఎక్కడా పొలిటికల్ స్పేస్ అయితే దొరకడం లేదు. పైగా బీఆర్ఎస్ రెండు సార్లు అధికారంలో ఉంటూ పటిష్ట పరచుకుంది. కాంగ్రెస్ కి మొదటి నుంచి క్యాడర్ బేస్ గట్టిగానే ఉంది. దీంతో బీజేపీ తెలంగాణాలో అధికారంలోకి రావాలీ అంటే సామాజిక సమీకరణలనే నమ్ముకోవాలని డిసైడ్ అయినట్లుగా కనిపిస్తోంది. ఆ పార్టీ వచ్చే ఎన్నికల కోసం బీసీ నినాదం ఎంచుకుంది అని అంటున్నారు.

బీసీ సీఎం అంటూ :

తెలంగాణా రాజకీయాల్లో బీసీ సీఎం నినాదం అన్నది కొత్తగా ఉండడమే కాదు అత్యధిక శాతం ఉన్న ఆ వర్గాలను ఆకర్షిస్తుందని కమలం పార్టీ బలంగా విశ్వసిస్తోంది. నిజానికి చూస్తే ఒక్క తెలంగాణా అనే కాదు రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇప్పటిదాకా బీసీ సీఎం అయిన వారు లేరు, ఉమ్మడి ఏపీలో ఎస్సీలకు సీఎం చాన్స్ దక్కింది కానీ బీసీల ఊసే లేదు. దాంతో ఇపుడు ఈ కొత్త నినాదానికి బీజేపీ పదును పెడుతోంది. తాము అధికారంలోకి వస్తే కచ్చితంగా బీసీలనే సీఎం గా చేస్తామని ఆ పార్టీ అంటోంది. కాంగ్రెస్ కి ఓటేసినా బీఆర్ఎస్ లని నెగ్గించినా బీసీలు సీఎం అయ్యే చాన్సే లేదు అని కూడా బీజేపీ అంటోంది. ఈ విధంగా ప్రధాన పార్టీలలో ఉన్న లోటుని బయటపెట్టి తాను అక్కడ పై చేయి సాధించాలని చూస్తోంది అని అంటున్నారు.

ఎవరికి కిరీటం :

బీజేపీ బీసీ సీఎం నినాదం వరకూ బాగానే ఉంది కానీ ఎవరినో ఒకరిని సీఎం అభ్యర్థిగా ముందు పెడితేనే కదా వర్కౌట్ అవుతుంది అన్నది కూడా ఉంది. దానితో బీజేపీలో బీసీ బడా నేతలు ఎవరు అన్నది అంతా ఆసక్తిగా గమనిస్తున్నారు. బీసీ నేతగా దశాబ్దం పాటు మంత్రిగా పనిచేసిన నాయకుడిగా ఈటెల రాజేందర్ ఉన్నారని ఆయన వర్గం అంటోంది. ఇక ఈ విషయం మీద ఈటెల అయితే సానుకూలంగా స్పందిస్తున్నారు. తెలంగాణా రాష్ట్ర రాజకీయాల్లో బీసీలకు సీఎం పదవి దక్కాల్సిందే అని ఆయన అంటున్నారు. బీజేపీ తెలంగాణాలో అధికారంలోకి వస్తే బీసీనే సీఎం చేస్తామని బీజేపీ ప్రకటించిన సంగతిని ఆయన గుర్తు చేస్తున్నారు. ప్రజలలో కూడా రాజకీయ చైతన్యం పెరిగింది అని అందువల్ల రానున్న కాలంలో తెలంగాణాకు బీసీ సీఎం తప్పకుండా వస్తారు అని అంటున్నారు.

బండి సంజయ్ కూడా :

అయితే బీజేపీలో మొదటి నుంచి పనిచేస్తూ వస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా బీసీ నేతగా ఉన్నారు. ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన హయాంలో పార్టీ ఎన్నో విజయాలను సాధించింది. దాంతో బీజేపీ బీసీ సీఎం నినాదం కనుక తీసుకుని ముందుకు సాగితే కచ్చితంగా బండి వర్సెస్ ఈటెల అన్నది వస్తుందని అంటున్నారు. ఈ ఇద్దరికీ చాన్స్ స్పష్టంగా ఉంటుందని చెబుతున్నారు. ఇక ఈటెల బీజేపీలో మొదటి నుంచి లేరు కదా అన్న డౌటే అవసరం లేదని పశ్చిమ బెంగాల్ లో సువేందు అధికారి కూడా ఒక ఎన్నిక ముందే పార్టీలో చేరి సీఎం అయ్యారు అని గుర్తు చేస్తున్నారు. దాంతో బీజేపీ బీసీ సీఎం గా ఈటెలకు చాన్సెస్ ఎక్కువ అని అంటున్నారు ఆయన అనుచరులు. ఈటెల ఈ విషయం మీద గట్టిగా మాట్లాడడంతో ఆయన ఫోర్ ఫ్రంట్ లో ఉన్నారని అర్థం అవుతోంది. చూడాలి మరి వచ్చే ఎన్నికల్లో బీసీ సీఎం నినాదం బీజేపీకి ఓట్లు రాలుస్తుందా లేదా అన్నది.

తర్వాతి వికెట్ కడియం శ్రీహరేనా ?



హైదరాబాద్ పెన్ పవర్: పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్ నిర్ణయాన్ని కొట్టి వేస్తూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మీద హైకోర్టు అనర్హత వేటు వేయడంతో ఆయన తర్వాత అనర్హత వేటు పడేది ఎవరి మీద అన్న చర్చ మొదలయింది. ఫిరాయింపుల విషయంలో స్పీకర్ ఎవరూ పార్టీ మారలేదని తీర్పు ఇచ్చారు. అయితే దానం నాగేందర్ పార్టీ మారిన అనంతరం కాంగ్రెస్ బీ ఫారం మీద సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసిన అంశాన్ని పరిగణనలోకి తీసుకుని హైకోర్టు వేటు వేసింది.

ఈ సంధర్భంగా హైకోర్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీర్పును కఠినంగా తప్పుపట్టింది. స్పీకర్ హౌస్ బయట చర్యలు తన పరిధిలోకి రావు, అసెంబ్లీలోని ప్రవర్తన మాత్రమే చూడాలి అని చెప్పడం రాజ్యాంగ విరుద్దం అని, న్యాయపరంగా వక్రీకరణ, తప్పుడు విధానం అని పేర్కొంది. ఇది ఆర్టికల్ 191(2) మరియు 10వ షెడ్యూల్ (పారా 2) లోని రాజ్యాంగ ఆదేశాలను ఉల్లంఘిచడమేని చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జీ.ఎం. మొహియుద్దీన్ ధర్మాసనం పేర్కొంది.ఈ పరిస్థితులలో పార్టీ ఫిరాయించిన మిగిలిన ఎనిమిది మందిలో తర్వాత వికెట్ ఎవరు అంటే నేరుగా స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కనిపిస్తున్నాడు. 2023లో బీఆర్ఎస్ నుండి గెలిచిన కడియం శ్రీహరి ఆ వెంటనే పార్టీ ఫిరాయించారు. ఈ నేపథ్యంలో కడియం శ్రీహరి మీద బీఆర్ఎస్ వేసిన పిటీషన్ త్వరలోనే విచారణకు రానున్నట్లు తెలుస్తుంది.ఈ కేసులో ప్రధానంగా 2024 ఎన్నికల్లో వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థిగా తన కూతురు కడియం కావ్య పోటీ చేయడం, అందులో నామినేషన్ పత్రాల మీద కడియం శ్రీహరి సంతకాలు చేయడమే కాకుండా కాంగ్రెస్ కండువాలు కప్పుకుని, కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరిన అంశాలు ప్రధానంగా విచారణకు రానున్నట్లు తెలుస్తుంది. కాబట్టి దానం తరువాత కడియం శ్రీహరి మీద వేటు తప్పదని అంటున్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలు అందరికీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ తాజాగా హైకోర్టు ఆయన నిర్ణయాన్ని తప్పుపట్టింది. దానం, కడియంతో పాటు మరో ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డికి కూడా ఇబ్బందులు తప్పవని తెలుస్తుంది. ఆయనను ప్రభుత్వ సలహాదారుగా నియమించడమే కాకుండా, సహాయ మంత్రి హోదా ఇవ్వడం ఆయనకు ఇబ్బందికరంగా మారుతుంది అని అంటున్నారు. మొత్తానికి ఈ అనర్హత అంశాలు ఎప్పుడు తేలుతాయి అన్నది ఆసక్తికర అంశంగా మారింది.

డిగ్రీ కాలేజీల్లో ఖాళీ సీట్ల భర్తీకి రంగం సిద్ధం.. స్పాట్ అడ్మిషన్లకు సీఎం ఆమోదం!

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణలోని డిగ్రీ కళాశాలల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ ప్రక్రియకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. ఈ మేరకు సంబంధిత ఫైలుపై సీఎం సంతకం చేసినట్లు ఉన్నత విద్యామండలి వర్గాల సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ద్వారా నిర్వహించిన విడతలవారీ కౌన్సెలింగ్‌లో ఇప్పటివరకు సుమారు 2 లక్షల మందికి పైగా విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో చేరారు. అయితే, ఇంకా దాదాపు 2.50 లక్షలకు పైగా సీట్లు ఖాళీగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో మిగిలిన సీట్లను భర్తీ చేయకపోతే అనేక కళాశాలల్లో సీట్లు వృథాగా మిగిలిపోయే ప్రమాదం ఉండటంతో ప్రభుత్వం స్పాట్ అడ్మిషన్లకు ప్రాధాన్యం ఇచ్చింది. గతంలో మాదిరిగానే ఈసారి కూడా ఇతర రాష్ట్రాలు, ఇతర బోర్డుల నుంచి వచ్చిన స్థానికేతర విద్యార్థులకు కూడా ఈ స్పాట్ అడ్మిషన్లలో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని ప్రతిపాదించారు. దీనివల్ల ఎక్కువ సంఖ్యలో సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉంది.

రెండు, మూడు రోజుల్లో షెడ్యూల్ విడుదలయ్యే చాన్స్..

సీఎం అనుమతి లభించడంతో ఉన్నత విద్యామండలి స్పాట్ అడ్మిషన్ల పూర్తి షెడ్యూల్‌ను సిద్ధం చేస్తోంది. ఈ రెండు–మూడు రోజుల్లోనే అధికారిక నోటిఫికేషన్‌తో పాటు వివరణాత్మక షెడ్యూల్‌ను ప్రకటించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులు కళాశాలలను నేరుగా సంప్రదించి, తమకు నచ్చిన కోర్సుల్లో సీటు పొందేందుకు ఇదొక సువర్ణావకాశం అని అధికారులు పేర్కొన్నారు.

రైస్ మిల్లర్ల సమస్యల పై ప్రభుత్వం సానుకూలం..

హైదరాబాద్ పెన్ పవర్: రైస్ మిల్లింగ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సివిల్ సప్లై కార్పొరేషన్ కన్సల్టెంట్ టి. దేవేందర్ రెడ్డిలతో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రైస్ మిల్లింగ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. మిల్లర్ల డిమాండ్స్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. మిల్లింగ్ పరిశ్రమ గురించి క్లుప్తంగా మోహన్ రెడ్డి వివరణ ఇచ్చారు. రైస్ మిల్లర్లు రైతులకు, ప్రభుత్వానికి భాగస్వాములేనని ప్రభుత్వం పేర్కొంది. మిల్లర్ల సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. రైస్ మిల్లింగ్ పరిశ్రమను పునఃప్రారంభించి ప్రభుత్వానికి సహకరించాలని, రాబోయే 10 రోజుల్లో మిల్లర్ల సమస్యలపై మరింత చర్చించి పరిష్కార మార్గాలను పరిశీలిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో రాష్ట్ర స్థాయి నాయకులు, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. శనివారం ప్రభుత్వ సమావేశంలో జరిగిన చర్చలు, ప్రభుత్వం వ్యక్తం చేసిన సానుకూల వైఖరిని పరిగణనలోకి తీసుకుని, రాష్ట్రవ్యాప్తంగా మిల్లింగ్ కార్యకలాపాలను పునఃప్రారంభించి ప్రభుత్వానికి సహకరించి చర్చలు జరపాలని నిర్ణయించారు.

‘మమ్మల్ని నకిలీలుగా చూపొద్దు.. వైసీపీ అసత్య ప్రచారంపై నినదించిన స్పోర్ట్స్ కోటా టీచర్లు

హైదరాబాద్ పెన్ పవర్: మైదానంలో ప్రత్యర్థులతో పోరాడి పతకాలు సాధించిన క్రీడాకారులు.. ఇప్పుడు తమ నియామకాలపై వస్తున్న ఆరోపణలతో మరో పోరాటాన్ని ఎదుర్కొంటున్నారు. మెగా డీఎస్సీ-2025లో స్పోర్ట్స్ కోటా ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులు తమ నియామకాలను సమర్థించుకుంటూ విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 370 మంది ఉపాధ్యాయులు హాజరైన ఈ సమావేశం.. తమపై జరుగుతున్న ప్రచారానికి సమాధానం చెప్పే వేదికగా మారింది.

మమ్మల్ని నకిలీలుగా చూపొద్దు

తమ నియామకాల్లో అక్రమాలు జరిగాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సహా కొందరు చేస్తున్న ఆరోపణలను ఉపాధ్యాయులు ఖండించారు. రాజకీయ విమర్శల కోసం తమ క్రీడా ప్రస్థానాన్ని.. ప్రతిభను ప్రశ్నించడం బాధాకరమని పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన తర్వాతే తాము స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాలకు అర్హత సాధించామని తెలిపారు. “మైదానంలో తగిలిన గాయాల కంటే.. నకిలీ అభ్యర్థులమంటూ వస్తున్న ఆరోపణలే ఎక్కువగా బాధిస్తున్నాయి” అని పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ అర్హతలపై అనుమానాలు ఉన్నవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, పతకాలు, క్రీడా రికార్డులను పరిశీలించాలని వారు సూచించారు.

పాత రికార్డులే ఆధారాలుగా..

తమ క్రీడా నేపథ్యాన్ని నిరూపించేందుకు పలువురు ఉపాధ్యాయులు సమావేశంలో పాత ఫొటోలు, వీడియోలను ప్రదర్శించారు. వివిధ పోటీల్లో పాల్గొన్న సందర్భాలు, సాధించిన పతకాలకు సంబంధించిన వివరాలను చూపించారు. దీంతో తమ ఎంపిక కేవలం కాగితాలపై జరిగిన ప్రక్రియ కాదని.. ఏళ్ల తరబడి సాగిన క్రీడా ప్రయాణానికి దక్కిన గుర్తింపు అని వారు వివరించారు.

రిజర్వేషన్‌పై వివరణ

స్పోర్ట్స్ కోటా నియామకాలు రాజ్యాంగబద్ధమైన హారిజంటల్ రిజర్వేషన్ విధానంలోనే జరుగుతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని తపాలా, ఐటీ, డీఆర్డీఓ, రైల్వే తదితర విభాగాల్లోనూ క్రీడాకారులకు ప్రత్యేక అవకాశాలు కల్పించే నియామక విధానాలు ఉన్నాయని వివరించారు. బ్రిడ్జ్ గేమ్‌ను పేకాటతో పోలుస్తూ జరుగుతున్న ప్రచారంపైనా వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. క్రీడల స్వభావం, నిబంధనలు తెలియకుండా ఒక క్రీడను తక్కువ చేసి మాట్లాడటం సరైంది కాదని అన్నారు.

మాజీ సైనికుడి ఆవేదన

సమావేశంలో మాట్లాడిన మాజీ సైనికుడు చక్రపాణిరెడ్డి తన అనుభవాలను ప్రస్తావించారు. దేశసేవ చేసిన తర్వాత క్రీడా కోటా ద్వారా ఉద్యోగం సాధించిన తనను కూడా అనుమానాస్పద వ్యక్తిగా చిత్రీకరించడం బాధాకరమని అన్నారు. వ్యక్తిగత రికార్డులు, ధ్రువపత్రాలను పరిశీలించకుండా ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

రాజకీయాలకు మమ్మల్ని బలిచేయొద్దు

ఖో-ఖో క్రీడాకారుడు పి.శివారెడ్డి మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారుల శ్రమను రాజకీయ వివాదాలకు ఉపయోగించవద్దని కోరారు. క్రీడాకారులకు ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ తమలాంటి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందని, దానిని అవమానించేలా ప్రచారం చేయడం సరికాదని అన్నారు.

ప్రభుత్వం నిర్ణయానికి కృతజ్ఞతలు

క్రీడాకారుల కోటాను 3 శాతానికి పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. తమ నియామకాల్లో టెట్ అర్హతను కూడా పరిగణనలోకి తీసుకున్నారని.. టెట్ రాయకుండా ఎవరికీ ఉద్యోగం రాలేదని వారు పేర్కొన్నారు. తమ విద్యార్హతలు, క్రీడా వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మెగా డీఎస్సీ-2025 ప్రక్రియ మంత్రి నారా లోకేశ్ పర్యవేక్షణలో పారదర్శకంగా జరిగిందని పలువురు అభ్యర్థులు అభిప్రాయపడ్డారు.

అసలు ప్రశ్న.. ఆరోపణలా? ఆధారాలా?

స్పోర్ట్స్ కోటా టీచర్ల సమావేశం ద్వారా ఒక విషయం స్పష్టమైంది. నియామక ప్రక్రియపై రాజకీయ ఆరోపణలు, అభ్యర్థుల నుంచి వస్తున్న ప్రతివాదాలు ప్రస్తుతం పరస్పరం ఎదురెదురుగా ఉన్నాయి. ఒకవైపు నియామకాలపై అనుమానాలు వ్యక్తమవుతుండగా.. మరోవైపు అభ్యర్థులు తమ వద్ద ఉన్న ధ్రువపత్రాలు, క్రీడా రికార్డులను పరిశీలించాలని సవాల్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ ఆరోపణలు, అభ్యర్థుల వివరణలను పక్కనపెట్టి.. అధికారిక నియామక నిబంధనలు, ధ్రువపత్రాల పరిశీలన, ఎంపిక ప్రక్రియకు సంబంధించిన రికార్డుల ఆధారంగానే వాస్తవాలు తేలాల్సి ఉంటుందని స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు చెబుతున్నారు. తమ ఉద్యోగాలను రాజకీయ వివాదానికి కేంద్రంగా మార్చకుండా వాస్తవాలను పరిశీలించాలని వారు కోరుతున్నారు.

హైఅలర్ట్‌లో ఐరోపా దేశాలు.. రష్యాతో యుద్ధానికి సిద్ధమవుతున్నాయా?

హైదరాబాద్ పెన్ పవర్: ఉక్రెయిన్--రష్యా యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఐరోపాలో భద్రతా ఆందోళనలు మరోసారి పెరిగాయి. ముఖ్యంగా రష్యా నుంచి డ్రోన్లు, మిస్సైళ్లు, సైబర్ దాడులు, ఇతర హైబ్రిడ్ దాడుల ముప్పు ఉందన్న హెచ్చరికలు యూరప్ దేశాలను అప్రమత్తం చేస్తున్నాయి. అయితే ఈ పరిణామాలను నేరుగా “మూడో ప్రపంచ యుద్ధానికి సన్నాహాలు”గా అర్థం చేసుకోవడం కంటే.. యూరప్ తన నిరోధక సామర్థ్యాన్ని పెంచుకుంటున్న దశగా చూడటం అవసరం.

ఇటీవల పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ మాట్లాడుతూ.. రష్యా ఉక్రెయిన్‌కు మద్దతు ఇస్తున్న నాటో దేశాలపై “అనుకోకుండా జరిగినట్లు” చూపించే డ్రోన్ లేదా మిస్సైల్ దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా నాటో తూర్పు సరిహద్దుల్లో ఇలాంటి ఘటనలు జరిగితే ఆ దేశాలు నాటో ఆర్టికల్ 5ను అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నాయా లేదా అన్నది పరీక్షించే ఉద్దేశం ఉండొచ్చని ఆయన పేర్కొన్నారు. ఇవి పోలాండ్ ఇంటెలిజెన్స్ అంచనాల ఆధారంగా చేసిన హెచ్చరికలని టస్క్ చెప్పారు.

ఆర్టికల్ 5 ఎందుకు కీలకం?

నాటో ఆర్టికల్ 5 ప్రకారం ఒక సభ్యదేశంపై సాయుధ దాడిని కూటమి మొత్తం మీద దాడిగా పరిగణించే సూత్రం ఉంది. అందుకే నాటో సభ్యదేశ భూభాగంలో రష్యా దాడి జరిగితే అది కేవలం రష్యా--ఉక్రెయిన్ యుద్ధం పరిధిలో ఉండకుండా పెద్ద భద్రతా సంక్షోభంగా మారే అవకాశం ఉంటుంది. అయితే ఆర్టికల్ 5 అనేది ఆటోమేటిక్‌గా ఒకే విధమైన సైనిక చర్యను నిర్దేశించదు.. మిత్రదేశాలు అవసరమైన చర్యలను నిర్ణయిస్తాయి. నాటో కూడా ప్రస్తుతం రష్యా యుద్ధాన్ని యూరో-అట్లాంటిక్ భద్రతకు తీవ్రమైన ముప్పుగా పేర్కొంటూ తన నిరోధక, రక్షణ సామర్థ్యాలను పెంచుతున్నట్లు చెబుతోంది.

ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్ ఎందుకు సిద్ధమవుతున్నాయి?

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఇటీవల రష్యా నుంచి వస్తున్న హైబ్రిడ్ ముప్పులు పెరుగుతున్నాయని పేర్కొంటూ కీలక మౌలిక సదుపాయాల రక్షణకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సైబర్ దాడులు, డ్రోన్లు వంటి పద్ధతులు సంప్రదాయ యుద్ధానికి భిన్నంగా ఉంటాయని ఫ్రాన్స్ భావిస్తోంది. ఇక స్వీడన్‌లోని గాట్‌ల్యాండ్ ద్వీపం బాల్టిక్ సముద్రంలో వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతం. సెప్టెంబర్ 14--23 మధ్య జర్మనీ, స్వీడన్ కలిసి నిర్వహిస్తున్న సిల్వర్ ఓటాన్ సైనిక విన్యాసాల్లో గాట్‌ల్యాండ్ చుట్టూ భద్రత, సైనిక బలగాల వేగవంతమైన మోహరింపు వంటి అంశాలను ప్రాక్టీస్ చేస్తున్నారు. బ్రిటన్ కూడా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతోంది. 2026 నేషనల్ రిస్క్ రిజిస్టర్‌లో దేశానికి ఎదురయ్యే తీవ్రమైన ప్రమాదాలను ప్రభుత్వం అధికారికంగా నమోదు చేసింది. రష్యా నుంచి వస్తున్న “సబ్ థ్రెషోల్డ్ అటాక్స్”, సైబర్ దాడులు తదితర ముప్పులు కూడా బ్రిటన్ రిజిలియెన్స్ ప్రణాళికల్లో భాగమయ్యాయి.

మరి మూడో ప్రపంచ యుద్ధం వస్తుందా?

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారంతో రష్యా నాటోపై పూర్తి స్థాయి యుద్ధానికి సిద్ధమవుతోందని ఖచ్చితంగా చెప్పడానికి ఆధారం లేదు. అదే సమయంలో యూరప్ దేశాలు ముప్పును తేలికగా తీసుకోవడం కూడా లేదు. డ్రోన్లు, సైబర్ దాడులు, సబోటేజ్, మౌలిక సదుపాయాలపై దాడులు వంటి “హైబ్రిడ్ వార్‌ఫేర్” ప్రమాదాలు ఇప్పటికే యూరప్ భద్రతా లెక్కల్లోకి వచ్చాయి.

మరోవైపు రష్యా--నాటో మధ్య నేరుగా ఘర్షణకు దారితీసే ఏ ఘటనైనా పరిస్థితిని వేగంగా మార్చగలదు. అందుకే యూరప్ చేస్తున్న సైనిక విన్యాసాలు, ఆసుపత్రులు.. అత్యవసర వ్యవస్థల సిద్ధత, సరిహద్దు రక్షణ చర్యలను యుద్ధం ఖాయం అనే సంకేతాలుగా కాకుండా.. యుద్ధం లేదా హైబ్రిడ్ దాడులు జరిగితే వాటిని ఎదుర్కొనే నిరోధక చర్యలుగా చూడటం మరింత సరైనది. అసలు యూరప్ ముందున్న ప్రధాన ప్రశ్న ఇదే.. యుద్ధం మొదలవుతుందా? అన్నదానికంటే.. యుద్ధం జరగకుండా రష్యాకు ఎంత బలమైన నిరోధక సంకేతం ఇవ్వగలదు? ప్రస్తుతం యూరప్ తీసుకుంటున్న చర్యల వెనుక ఉన్న ప్రధాన వ్యూహాత్మక ఆలోచన ఇదే.

పండుగ రద్దీకి రైల్వే ఏర్పాట్లు.. ఏపీ, తెలంగాణ మధ్య ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ పెన్ పవర్: దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీని నివారించేందుకు చర్లపల్లి - శ్రీకాకుళం మధ్య 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైళ్లను అక్టోబర్, నవంబర్ నెలల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. షెడ్యూల్ వివరాల ప్రకారం.. రైలు నంబర్ 07037 (చర్లపల్లి - శ్రీకాకుళం) అక్టోబర్ 6, 13, 20, 27 తేదీలతో పాటు నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో నడవనుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 07038 (శ్రీకాకుళం - చర్లపల్లి) అక్టోబర్ 7, 14, 21, 28 మరియు నవంబర్ 4, 11, 18, 25 తేదీల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది.

ఈ ప్రత్యేక రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్లలో ఆగుతాయి.

వీటితో పాటు చర్లపల్లి - నాగర్‌కోయిల్ మార్గంలోనూ 10 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైలు నంబర్ 07535 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 23 వరకు ప్రతి శుక్రవారం, రైలు నంబర్ 07536 సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 25 వరకు ప్రతి ఆదివారం నడవనున్నాయి. పండుగ సీజన్‌లో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ఈ ప్రత్యేక సర్వీసులను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

నాదెండ్ల సందేశం....జనసేనకు ఎన్ని సీట్లు ?

హైదరాబాద్ పెన్ పవర్: జనసేన ఈసారి అంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి భారీగానే ఆశలు పెట్టుకుంది. మరీ ముఖ్యంగా గ్రౌండ్ లెవెల్ లో ఉన్నద్వితీయ తృతీయ శ్రేణి నాయకులు, అలాగే క్యాడర్ కూడా ఎక్కువ సీట్లు పోటీ చేయాలని చూస్తున్నారు. దాని వల్ల తమకు అవకాశాలు వస్తాయని పదేళ్లకి పైగా పార్టీ కోసం పడిన కష్టానికి తగిన ఫలితం దక్కుతుందని కూడా భావిస్తున్నారు. ఇక గత కొంతకాలంగా జనసేనలో ఉన్న అభిప్రాయాలు వారి ఆలోచనలకు తగిన విధంగా అధినాయకత్వం కూడా రియాక్ట్ అయింది. జనసేన 2024 ఫార్ములాతో కాదని 2026 కి వచ్చేసరికి బలం పెరిగింది కాబట్టి ఎక్కువ సీట్లు దక్కాలని కూడా నేతల నుంచి డిమాండ్ వచ్చింది. దానికి తగినట్లుగానె 30 శాతం ఫార్ములా అన్నది ఇపుడు ప్రచారంలో ఉంది.

ఈ రేషియో అమలు అయితే :

జనసేన పెద్దలు ఈ మధ్య దాకా చెప్పినట్లుగా 30 శాతం సీట్ల సర్దుబాటు కనుక అమలు అయితే ఏపీలో ఉన్న 17 కార్పొరేషన్లలో అయిదారు మేయర్ పీఠాలు దక్కాలి. అలాగే ఎనభై కి పైగా ఉన్న మునిసిపాలిటీలు నగర పాలికలలో 30 దాకా లభించాయి. ఇక 28 దాకా ఉన్న జెడ్పీ పీఠాలలో తొమ్మిది దాకా లభించాలి. రెండు వందల జడ్పీటీసీలు, వేలాదిగా ఉన్నఎంపీటీసీలు కూడా పొత్తు వాటాలో దక్కాలి. మరి ఈ విధంగానే ఆశలు పెంచుకుని జనసేన నేతలు దిగువ స్థాయిలో పని చేసుకుని పోతున్నాయి. అయితే జనసేనలో నంబర్ టూ అయిన మంత్రి నాదెండ్ల మనోహర్ అయితే తాపీగా చెప్పాల్సింది చెబుతున్నారు. అదేంటి అంటే ఎక్కువగా అంచనాలు పెంచుకోవద్దు అని. దాంతోనే ఇపుడు జనసేన నేతలలో కొత్త రకం ఆందోళన పెరిగిపోతోంది అని అంటున్నారు.

జనసేన సమావేశంలో నాదెండ్ల :

విశాఖలో తాజాగా జరిగిన పార్టీ ఆత్మీయ సమావేశంలో జనసేన నంబర్ టూ నేత అయిన నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు అయితే ఆ పార్టీలో రాజకీయ కలకలం రేపుతున్నాయి. ఆయన అన్నది చూస్తే జనసేనకి 60-70 సీట్లని ఎక్స్పెక్ట్ చేయడం మంచిది కాదు అని. అనే కాదు పదవి అధికారంతో పాటు పార్టీకి బాధ్యత కూడా ఉంది అని అన్నారు. , మనం గెలిచే సీట్లు తప్పకుండా తీసుకుందామని మరో మాట అన్నారు. ఇక ఆయన చెప్పినది చూస్తే కూర్చొన్న కొమ్మను నరుక్కోవద్దు అన్న సందేశం కూడా ఉంది. జనసేనాని పవన్ కళ్యాణ్ ఆలోచనలను సైనికులే అర్థం చేసుకోకపోతే ఎలా అని కూడా నాదెండ్ల ప్రశ్నించారు.

సంస్థాగతంగా బలం :

అదే మీటింగులో నాదెండ్ల మరిన్ని వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. సంస్థాగతంగా జనసేన ఇంకా బలపడాల్సి ఉందని ఆయన చెప్పారు అని చెబుతున్నారు. ఒక పార్టీగా జనసేన నెమ్మదిగా ఎదగాల్సి ఉందని కూడా సూచించారు. ఏతా వాతా నాదెండ్ల మనోహర్ చెప్పేది ఏంటి అంటే బలం ఉన్న చోటనే పోటీ అని. మరి ఆ బలం ఎంత ఉంది ఏమిటి అన్నది ఎవరు తేలుస్తారు అన్నదే ఇపుడు జనసైనికులకు కలుగుతున్న కీలక ప్రశ్న. జనసేన బలం ఇంతే అని ఇచ్చినన్ని సీట్లు తీసుకుంటే ఇంక మనం ఎప్పటికి ఎదిగేది అని జనసైనికులు అయితే మండిపడుతున్నారు. ఏ పార్టీ అయినా కొత్తగా స్థానాలలో పోటీ చేస్తే కదా బలం ఎంత ఉంది అన్నది తెలిసేది అని ప్రశ్నిస్తున్నారు.

ఆ నాలుగు జిల్లాలు చాలవా :

జనసేనకు ఏపీ అంతా అవసరం లేదు కేవలం కృష్ణా,ఈస్ట్, వెస్ట్, వైజాగ్ ఇలా చూస్తే నాలుగు జిల్లాల్లో టీడీపీ-జనసేన బలం 60-40 గా ఉంటునని కూడా జనసైనికులు సూచిస్తున్నారు. కాబట్టి ఈ నాలుగు జిల్లాల్లో అయినా 60-40 పద్ధతిలో సీట్లు పంచటం న్యాయం అని వాదిస్తున్నారు. ఇక్కడ చూస్తే మేయర్ జెడ్పీ పీఠాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. వీటితో పాటు మునిసిపాలిటీలలో కూడా జనసేనకు న్యాయమైన వాటా ఇవ్వాలని కోరుతున్నారు. మొత్తానికి నాదెండ్ల అయితే చెప్పాల్సింది చెప్పారు అంటే జనసేనకు ఎన్ని సీట్లు దక్కుతాయన్న గుబులు అయితే పార్టీ వర్గాలలో ఉంది. తొందరలోనే చంద్రబాబు పవన్ బీజేపీ నేతలు సీట్ల సర్దుబాటు మీద కూర్చో బోతున్నారు అని అంటున్నారు. జనసేనకు నిజంగా 30 శాతం ఫార్ములా ప్రకారం సీట్లు వస్తాయా లేక నాదెండ్ల చెప్పినట్లుగా బలం ఉన్న చోట్ల సీట్లు దక్కుతాయా అన్నది చూడాల్సి ఉంది అని అంటున్నారు.

తిరుమలకు పోటెత్తిన భక్తులు.. దర్శన సమయం ఎంతంటే?

హైదరాబాద్ పెన్ పవర్: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. గత కొన్ని రోజులుగా భక్తుల రద్దీ కొనసాగుతుంది. బ్రహ్మోత్సవాలు జరుగుతుండటంతో పాటు వరస సెలవులు రావడంతో భక్తుల రద్దీ పెరిగింది. నిన్న గరుడ వాహన సేవకు లక్షల సంఖ్యలో హాజరయిన భక్తులు నేడు స్వామి వారి దర్శనం కోసం వేచి చూస్తున్నారు. దీంతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిన్న ఫోర్ వీలర్లను కూడా తిరుమల కొండపైకి అనుమతించలేదు. పార్కింగ్ సౌకర్యం ఇబ్బందికరంగా మారడంతో అనుమతించలేదు. కేవలం టీటీడీ బస్సుల ద్వారానే కొండపైకి భక్తుల రాకపోకలు నిన్నంతా సాగాయి. నేడు వసతి గృహాలు కొరత కూడా కొనసాగుతుంది.

నేడు వాహన సేవలివీ...

తిరుమలలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23వ తేదీ వరకూ జరగనున్నాయి. దీంతో తిరుమలకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు చెబుతున్నారు. తిరుమలలో వైభవంగా శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈరోజు ఉదయం ఎనిమిది గంటలకు హనుమంత వాహన సేవ జరిగింది. సాయంత్రం నాలుగు గంటలకు స్వర్ణరథంపై మలయప్పస్వామి విహరించనున్నారు. రాత్రి ఏడు గంటలకు గజ వాహన సేవ ఉంటుంది. మాడ వీధుల్లో మలయప్పస్వామిని దర్శించేందుకు భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

31 కంపార్ట్ మెంట్లలో...

తిరుమలలో నేడు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని 31 కంపార్ట్ మెంట్లలో శ్రీవారి దర్శనం కోసం భక్తులు వేచి ఉన్నారు. సర్వదర్శనం కోసం క్యూ లైన్ లోకి ఉదయం టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం ఎనిమిది గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. నిన్న శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 83,589 గా ఉంది. శ్రీవారికి తలనీలాలు సమర్పించిన భక్తులు 27,828గా ఉందని అధికారులు తెలిపారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.17 కోట్లు వచ్చిందని అధికారులు తెలిపారు. నిన్న శ్రీవారి లడ్డూ ప్రసాదం అమ్మకం 4.77 లక్షల మేరకు జరిగాయి. అన్న ప్రసాదం స్వీకరించిన భక్తుల సంఖ్య 7.04 లక్షల మంది అని అధికారులు తెలిపారు. నేడు ఆదివారం కావడంతో భక్తుల రద్దీ కొనసాగే అవకాశముంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

5053 పేజీల ఛార్జ్‌షీట్‌తో కేతన్ అగర్వాల్ కేసు.. దేశంలో సినీఫక్కీని తలపించేలా టాప్-5 హత్యోదంతాలు!

సంచలనం సృష్టించిన కేతన్ అగర్వాల్ హత్య కేసుకు సంబంధించి పూణే రూరల్ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి వడ్గావ్ మావల్ కోర్టులో ఏకంగా 5053 పేజీలతో కూడిన భారీ చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. పూణేకు చెందిన రియల్టర్ కేతన్ అగర్వాల్‌ను గత ఏడాది జూన్ 18న లోహగడ్ కోటపై నుంచి తోసివేయడంతో అతడు ప్రాణాలు కోల్పోయారు. ఈ హత్య కేసుకు సంబంధించి అతడి కాబోయే భార్య సియా గోయల్. ఆమె ప్రియుడు చేతన్ చౌదరితో పాటు రితేష్ హాంగే అనే మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.కోర్టులో సమర్పించిన ఈ భారీ చార్జ్‌షీట్‌లో నిందితులకు వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాధారాలను పోలీసులు పొందుపరిచారు. వాటిలో ప్రధానంగా మెసేజ్‌లు, ఫోటోలు, మొబైల్ ఫోన్ డేటా, కాల్ డిటైల్ రికార్డ్స్, సాక్షుల వాంగ్మూలాలు , టెక్నికల్ అనాలసిస్ సర్టిఫికెట్లు ఉన్నాయి. ఈ దర్యాప్తులో నిందితులు ఈ హత్యకు ముందు పక్కాగా పథకం రచించినట్లు వెల్లడైంది. లోహగడ్ కోట వద్దే గతంలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోయిన ఇలాంటి ఘటనే జరిగిందా అని నిందితురాలు సియా గోయల్ ఆన్‌లైన్‌లో శోధించినట్లు చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా గత ఏడాది మే నెలలో మేఘాలయలో హనీమూన్ సమయంలో హత్యకు గురైన రాజా రఘువంశీ కేసు (సోనమ్ రఘువంశీ కేసు) గురించి కూడా వారు ఇంటర్నెట్‌లో పలుమార్లు స్టడీ చేసినట్లు వెల్లడైంది.ఇక ఇటీవలి కాలంలో భారతదేశంలో ఇలాంటిదే అత్యంత సంచలనం సృష్టించిన కొన్ని ఘాతుకాలను పరిశీలిస్తే.. ఢిల్లీలో జరిగిన శ్రద్ధా వాకర్ హత్యోత్సవం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. సహజీవనం చేస్తున్న భాగస్వామిని అతి కిరాతకంగా హత్య చేసి శరీరాన్ని ముక్కలుగా చేసి ఫ్రిజ్‌లో దాచిన వైనం సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అలాగే బెంగళూరులో జరిగిన శ్రద్ధా మర్డర్ కేసు (మహాలక్ష్మి హత్యోదంతం) కూడా మరో దారుణమైన ఉదాహరణగా నిలిచింది. ఒక మహిళ శరీరాన్ని ముక్కలుగా నరికి ఫ్రిజ్‌లో కుక్కిన ఈ సంఘటనలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి.అలాగే కోల్‌కతాలోని ఆర్.జి కర్ మెడికల్ కాలేజీలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఉదంతం వైద్య రంగంలోనూ.. దేశవ్యాప్తంగానూ గొప్ప నిరసనలకు.. సంచలనానికి దారితీసింది. మరోవైపు దేశ రాజధానిలో జరిగిన అంకిత హత్య కేసు లేదా ఉమేష్ పాల్ హత్య వంటి ఘటనలు కూడా ప్రణాళికాబద్ధమైన నేరాలకు అద్దం పట్టాయి. ఇటువంటి కేసులన్నీ నేరస్థులు నేరాన్ని అమలు చేయడానికి ముందే సినిమాలను తలపడేలా ఇంటర్నెట్‌లో ప్లాన్లు వేయడం.. హత్యల తర్వాత దొరకకుండా ఉండేందుకు డిజిటల్ ఆధారాలను చెరిపేయడానికి ప్రయత్నించడం వంటి కోణాలతో తీవ్ర సంచలనం సృష్టించాయి.

సెర్చ్ హిస్టరీయే నేరస్థులను పట్టించే బలమైన ఆయుధాలు:

ఇలాంటి ప్రీ ప్లాన్డ్ మర్డర్ కేసుల్లో ఇంటర్నెట్ శోధన క్రిమినల్స్ ని ఎలా పట్టిస్తోందో తెలిస్తే అవాక్కవుతారు. చాలా ప్రీ-ప్లాన్డ్ మర్డర్ కేసుల్లో నేరస్థులు ఎంత పక్కాగా పథకం రచించినా డిజిటల్ యుగంలో ఇంటర్నెట్ శోధనలు.. సెర్చ్ హిస్టరీయే నేరస్థులను పట్టించే బలమైన ఆయుధాలుగా మారుతున్నాయి. హత్యకు ముందు గూగుల్‌లో చేసే సెర్చ్‌లు, క్రైమ్ వెబ్‌సైట్ల స్టడీలు లేదా ఇలాంటి ఇతర సంఘటనల కోసం వెతికిన ఆన్‌లైన్ రికార్డులు నేరస్థుల ఆలోచనా విధానాన్ని (మోడస్ ఆపరేండి) పోలీసులు- సైబర్ ఎక్స్‌పర్ట్‌లకు స్పష్టంగా కళ్లకు కడుతున్నాయి. ఫోన్ డేటా, బ్రౌజింగ్ హిస్టరీ, డిలీట్ చేసిన డిజిటల్ జాడలను రిట్రీవ్ చేయడం ద్వారా పోలీసులు కోర్టులో తిరుగులేని సాక్ష్యాలను ప్రవేశపెడుతున్నారు. ముందస్తు పథకం ప్రకారం.. ప్రమాదంగా చిత్రీకరించాలని చూసే నిందితులు, తాము ఆన్‌లైన్‌లో చేసిన అనుమానాస్పద సెర్చ్‌ల ద్వారానే దర్యాప్తు అధికారుల కంట్లో పడి సులభంగా చట్టం ముందు దోషులుగా నిలబడుతున్నారు.

సామాన్య పౌరుడిలా రైల్వే స్టేషన్ ముందే నిలబడి... జపాన్ మాజీ ప్రధాని నోడా వైరల్ వీడియో వెనుక అసలు కథ!

అభివృద్ధి, సాంకేతికత, క్రమశిక్షణతో ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జపాన్.. తన రాజకీయ సంస్కృతితోనూ మరోసారి వార్తల్లో నిలిచింది. ఒక దేశానికి ప్రధానిగా చేసిన వ్యక్తి సైతం ఎలాంటి హంగామా లేకుండా సాధారణ పౌరుడిలా ప్రజల మధ్యకు వచ్చి నిలబడితే ఎలా ఉంటుంది? సరిగ్గా అలాంటి దృశ్యమే ఇప్పుడు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జపాన్ మాజీ ప్రధాని యోషిహికో నోడా ఒక రైల్వే స్టేషన్ వెలుపల ఒంటరిగా నిలబడి అటుగా వెళ్తున్న బాటసారులకు స్వయంగా కరపత్రాలు పంచుతున్న దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

సాధారణంగా ప్రజాప్రతినిధులు లేదా మాజీ హోదాలో ఉన్న నాయకులు బయటకు వస్తే భారీ బందోబస్తు, కాన్వాయ్ వాహనాలు, వందలాది మంది కార్యకర్తల సందడి కనిపిస్తుంది. కానీ యోషిహికో నోడా విషయంలో అది పూర్తిగా భిన్నంగా జరిగింది. జపాన్‌లోని అత్యంత రద్దీగా ఉండే ఓ రైల్వే స్టేషన్ వద్ద సాధారణ దుస్తుల్లో నిలబడిన ఆయన ప్రజలకు నమస్కరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే అక్కడి ప్రజలు కూడా ఆయనను చూసి ఎగబడటం గానీ ప్రత్యేకంగా ఆటోగ్రాఫ్‌లు, సెల్ఫీల కోసం చుట్టుముట్టడం గానీ చేయలేదు. ప్రధాని అయినా సరే విధి నిర్వహణలో సాధారణ పౌరుడితో సమానమే అనే భావన అక్కడ స్పష్టంగా కనిపించింది.యోషిహికో నోడా జపాన్ రాజకీయాల్లో అత్యంత సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడు. ఆయన 2011 నుండి 2012 వరకు జపాన్ ప్రధానిగా సేవలందించారు. డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ జపాన్ తరఫున ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో 2011 నాటి సునామీ, భూకంపం, ఫుకుషిమా అణు ప్రమాదం వంటి అత్యంత తీవ్రమైన సంక్షోభ సమయాల్లో దేశాన్ని సమర్థవంతంగా నడిపిన చరిత్ర ఆయనకు ఉంది. ప్రధాని పదవి నుంచి దిగిపోయినప్పటికీ ఆయన క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతూ నియోజకవర్గ స్థాయి పనులను సైతం స్వయంగా చూసుకుంటూ ప్రజాసేవ, వినయానికి అక్కడ నిదర్శనంగా నిలుస్తున్నారు. ఈ ఘటన జపాన్ రాజకీయ సంస్కృతికి ఒక ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది. జపాన్ ఎన్నికల ప్రచారంలో నాయకులు స్వయంగా స్టేషన్ల వద్ద నిలబడి ప్రజలను కలవడం, మాట్లాడటం అక్కడ ఒక సాధారణ పద్ధతి. దళారులు లేదా భారీ ప్రచార రథాలు లేకుండా అభ్యర్థులు నేరుగా ప్రజల్లోకి వెళ్లి తమ విధానాలను వివరిస్తారు. అధికార హోదా కంటే ప్రజాసేవ, వినయానికే అక్కడ రాజకీయ నాయకులు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. శబ్ద కాలుష్యానికి, హంగామాకు తావులేకుండా ప్రత్యక్ష సంభాషణలకే అక్కడి నియమాలు, సంస్కృతి మొగ్గు చూపుతాయి.

ఈ వీడియోను చూసిన ప్రపంచవ్యాప్త నెటిజన్లు జపాన్ నాయకుల వినయం, అక్కడి రాజకీయ పరిణతిపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. రాజకీయాలంటే అధికార ప్రదర్శన కాదని.. కేవలం ప్రజాసేవ మాత్రమేనని చెప్పడానికి ఈ వీడియో ఒక ఉదాహరణగా నిలుస్తోంది. ప్రధాని అయినా సరే ప్రజాస్వామ్యంలో ప్రజలే అసలైన నాయకులని ఇది నిరూపిస్తోంది. ఒక మాజీ ప్రధాని అత్యంత సాధారణంగా ప్రజల మధ్యకు వచ్చి కరపత్రాలు పంచడం జపాన్ కే కాకుండా ప్రపంచ రాజకీయ వ్యవస్థలన్నింటికీ ఒక నూతన కోణాన్ని, ఆదర్శవంతమైన దృక్పథాన్ని పరిచయం చేసిందనడంలో సందేహం లేదు.

మోదీ బర్త్‌డే వేడుకలకు డుమ్మా.. ఐఐఎం విద్యార్థులకు షోకాజ్ నోటీసులు?

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా జమ్మూలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం జమ్మూ) లో నిర్వహించిన ఓ కార్యక్రమం ఇప్పుడు రాజకీయ దుమారం రేపుతోంది. సాధారణంగా విద్యాసంస్థల్లో జరిగే కార్యక్రమాలకు విద్యార్థుల హాజరు పెద్దగా చర్చనీయాంశం కాకపోవచ్చు. కానీ.. ఈసారి కార్యక్రమానికి గైర్హాజరైన విద్యార్థులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం.. రూ.500 జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించడం వివాదానికి కేంద్రంగా మారింది.సెప్టెంబర్ 17న ఐఐఎం జమ్మూ అకడమిక్ బ్లాక్‌లో 'జ్యోతి ప్రజ్వలన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల హాజరు తప్పనిసరి అని స్టూడెంట్స్ కౌన్సిల్ పేర్కొంది. హాజరు కాలేని విద్యార్థులు అందుకు గల కారణాలను లిఖితపూర్వకంగా వివరించాలని నోటీసుల్లో సూచించింది. వైద్యపరమైన కారణాలను మినహాయించి ఇతర కారణాలను పరిగణనలోకి తీసుకోబోమని, గైర్హాజరైన వారికి రూ.500 జరిమానా విధించవచ్చని పేర్కొనడం చర్చకు దారితీసింది.

మొదట సుమారు 65 మంది విద్యార్థులకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయితే ప్లేస్‌మెంట్ ప్రక్రియలో ఉన్నవారు.. అనారోగ్య కారణాలతో కార్యక్రమానికి రాలేకపోయిన వారి విషయంలో నోటీసులను ఉపసంహరించుకున్నామని స్టూడెంట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ అకుల్ శర్మ తెలిపారు. ఇప్పటివరకు ఏ విద్యార్థిపైనా జరిమానా విధించలేదని కూడా ఆయన స్పష్టం చేశారు.

రాజకీయ కార్యక్రమమా? క్యాంపస్ కార్యక్రమమా?

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి విద్యార్థుల హాజరును తప్పనిసరి చేయడం సరైనదేనా? లేక దీనిని సాధారణ క్యాంపస్ కార్యకలాపంగా పరిగణించాలా? ఈ రెండు వాదనల మధ్యే ప్రస్తుతం చర్చ సాగుతోంది.

ఈ కార్యక్రమానికి బీజేపీ ఎమ్మెల్యే యుధ్‌వీర్ సేథీతో పాటు ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ సహాయ్ హాజరయ్యారు. దీంతో కార్యక్రమం రాజకీయ రంగు పులుముకుందని కాంగ్రెస్ విమర్శించింది. విద్యాసంస్థలు విద్యార్థుల్లో స్వతంత్ర ఆలోచనా విధానాన్ని.. ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాల్సిన ప్రదేశాలని కాంగ్రెస్ జమ్మూ-కశ్మీర్ ఇన్‌చార్జ్ సయ్యద్ నసీర్ హుస్సేన్ పేర్కొన్నారు. రాజకీయ నాయకుల పుట్టినరోజు కార్యక్రమాలకు విద్యార్థులను తప్పనిసరిగా హాజరయ్యేలా చేయడం.. గైర్హాజరైతే జరిమానా విధిస్తామని హెచ్చరించడం సమంజసం కాదని ప్రశ్నించారు.అయితే ఐఐఎం వైపు నుంచి మరో వివరణ వచ్చింది. విద్యార్థులు క్యాంపస్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేలా చేయడంలో భాగంగానే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధి తెలిపారు. ఈ వ్యవహారాన్ని రాజకీయ కోణంలో చూడాల్సిన అవసరం లేదని, ఇప్పటివరకు ఎవరికీ జరిమానా విధించలేదని స్పష్టం చేశారు.

అసలు చర్చ హాజరుపై కాదు.. హద్దులపై ఈ వ్యవహారంలో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. వివాదం కేవలం రూ.500 జరిమానా చుట్టూ తిరగడం లేదు. విద్యార్థులపై సంస్థల విధించే నియమాలకు ఎక్కడ వరకు పరిమితి ఉండాలి? క్యాంపస్‌లో నిర్వహించే కార్యక్రమాల్లో ఏవి తప్పనిసరి? వ్యక్తిగత అభిప్రాయాలు, రాజకీయ అనుబంధాలకు అతీతంగా విద్యార్థులకు కార్యక్రమాలకు హాజరు కావాలా? అనే ప్రశ్నలు ముందుకొస్తున్నాయి.ఒకవైపు విద్యాసంస్థలు విద్యార్థుల్లో సామాజిక అవగాహన, భాగస్వామ్యం పెంచేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం సహజమే. మరోవైపు ఒక రాజకీయ నాయకుడి జన్మదినంతో ముడిపడిన కార్యక్రమానికి తప్పనిసరి హాజరు నిబంధన పెట్టినప్పుడు అది విద్యార్థుల స్వేచ్ఛకు సంబంధించిన ప్రశ్నలను లేవనెత్తే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం ఐఐఎం జమ్మూ వివరణ ప్రకారం ఎవరికీ జరిమానా విధించలేదు. ప్లేస్‌మెంట్, ఆరోగ్య కారణాలను పరిగణనలోకి తీసుకున్నట్లు కూడా వెల్లడైంది. అయితే మొదట జారీ చేసిన నోటీసులపై వచ్చిన అభ్యంతరాలు మాత్రం విద్యాసంస్థల్లో విద్యార్థుల భాగస్వామ్యం, స్వేచ్ఛ, సంస్థాగత నియమాల మధ్య సమతుల్యతపై మరోసారి చర్చకు తెరతీశాయి.అందుకే ఈ ఘటనను కేవలం రాజకీయ వివాదంగా చూడటం కంటే.. విద్యాసంస్థల్లో కార్యక్రమాలు నిర్వహించే విధానం, విద్యార్థుల హాజరుపై నియమాలు, వ్యక్తిగత స్వేచ్ఛకు సంస్థలు ఇచ్చే ప్రాధాన్యం వంటి విస్తృత అంశాల నేపథ్యంలో చూడాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అక్కడి పాఠశాలల్లో సేఫ్టీ అలర్ట్..

విశాఖపట్నం జిల్లా భీమిలి కస్తూర్బా పాఠశాల హాస్టల్‌లో నిద్రిస్తున్న బాలికల జడలు కత్తిరించిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. కేవలం సింగిల్ జడలు వేసుకున్న పిల్లలనే టార్గెట్ చేస్తూ చేసిన ఈ వికృత చర్య, ప్రభుత్వ హాస్టళ్లలో రక్షణ వ్యవస్థ ఏ స్థాయిలో ఉందో స్పష్టం చేస్తోంది. బయటి వ్యక్తులు లోపలికి వచ్చారా లేదా లోపల ఉన్నవారే చేశారా అనే దానికంటే, అసలు అర్ధరాత్రి వేళల్లో విద్యార్థినుల గదుల్లోకి ఎవరు పడితే వారు వెళ్లేలా ఉన్న భద్రతా లోపాలపై ఇప్పుడు తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అర్ధరాత్రి నిఘా ఎవరిది?:

గాఢ నిద్రలో ఉన్న పది మంది బాలికల జడలు కత్తిరిస్తున్నా ఎవరికీ తెలియకపోవడం కేర్‌టేకింగ్ వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనం. రాత్రి వేళల్లో హాస్టల్ గదులకు సరైన లాకింగ్ వ్యవస్థ లేకపోవడం, విద్యార్థినులను పర్యవేక్షించాల్సిన వార్డెన్‌లు లేదా అటెండెంట్లు తమ బాధ్యతల నుంచి తప్పుకోవడం వల్లే ఇలాంటి దుశ్చర్యలు జరుగుతున్నాయి. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నిద్రించే సమయంలో పిల్లల ప్రాథమిక భద్రతకే ముప్పు వాటిల్లుతోంది.

మౌలిక వసతుల లేమి ఓ నిఘా రాహిత్యం:

ప్రభుత్వ కస్తూర్బా పాఠశాలలు ప్రధానంగా పేద, గ్రామీణ ప్రాంత బాలికలకు విద్యాబుద్ధులు నేర్పే కేంద్రాలు. అయితే అనేక చోట్ల ప్రాథమిక సీసీటీవీ కెమెరాలు పనిచేయకపోవడం, కాంపౌండ్ వాల్స్ సరిగ్గా లేకపోవడం మరియు సెక్యూరిటీ గార్డుల పర్యవేక్షణ కొరవడటం పరిపాటిగా మారింది. ఇక నిఘా వ్యవస్థలు లేకపోవడం వల్ల ఆకతాయిలు లేదా లోపలి వ్యక్తులు భయం లేకుండా ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడేందుకు ఆస్కారం ఏర్పడుతోంది.

భయం గుప్పిట్లో గ్రామీణ బాలికా విద్య:

తమ పిల్లలకు మంచి భవిష్యత్తు దక్కుతుందని భావించి తల్లిదండ్రులు హాస్టళ్లలో చేర్పిస్తుంటారు. కానీ, ఇలాంటి భయానక వాతావరణం నెలకొంటే పేద వర్గాలు తమ ఆడపిల్లలను చదువుకు దూరం చేసే ప్రమాదం ఉంది. ఒక్క ఘటన జరిగినా దాని ప్రభావం వందలాది మంది గ్రామీణ విద్యార్థినుల విద్యపై పడుతుంది. ఇక హాస్టళ్లలో భద్రత కొరవడితే అది అంతిమంగా బాలికల అక్షరాస్యత శాతాన్ని దెబ్బతీసే సామాజిక సంక్షోభానికి దారితీస్తుంది.

కఠిన చర్యలు , ఎన్‌ఫోర్స్‌మెంట్ అవసరం:

కేవలం విచారణలు పేరుతో కాలయాపన చేయకుండా, పాఠశాల యాజమాన్యం మరియు నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రతి ప్రభుత్వ హాస్టల్‌లో డిజిటల్ అటెండెన్స్, పనిచేసే సీసీటీవీలు మరియు రాత్రిపూట మహిళా సెక్యూరిటీ గార్డులు తప్పనిసరి చేయాలి. ఇక విద్యార్థినులకు మానసిక ధైర్యాన్ని ఇస్తూ, భద్రతా ప్రోటోకాల్స్‌ను కచ్చితంగా అమలు చేసినప్పుడే తల్లిదండ్రుల్లో మళ్లీ నమ్మకం పునరుద్ధరించబడుతుంది.

బాధ్యతాయుత పాలనే రక్షణ:

విద్యార్థినుల రక్షణను కేవలం ఒక రొటీన్ పరిపాలనా అంశంగా చూడకుండా, అత్యంత ప్రాధాన్యత కలిగిన బాధ్యతగా ప్రభుత్వం భావించాలి. ఇక భీమిలి ఘటన ఒక తీవ్ర హెచ్చరిక లాంటిది. ఇకనైనా భద్రతా లోపాలను వెంటనే సరిదిద్ది, ప్రభుత్వ హాస్టళ్లను పిల్లలకు సురక్షితమైన నివాసాలుగా మార్చాల్సిన అత్యవసర బాధ్యత అధికారులపై ఉంది.

ఆర్కిటిక్ వ్యూహంలో 'ట్రంప్' మాస్టర్ మైండ్: గ్రీన్‌లాండ్‌పై అమెరికా శాశ్వత పట్టు వెనుక అసలు కథ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌లతో కుదుర్చుకున్న కీలక భద్రతా ఒప్పందం అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. గ్రీన్‌లాండ్‌ను అమెరికా కొనుగోలు చేస్తుందంటూ గతంలో వచ్చిన ప్రచారానికి స్వస్తి పలుకుతూ అక్కడ సైనిక భద్రతపై "శాశ్వత నియంత్రణ" సాధించడమే లక్ష్యంగా ఈ డీల్ ముందుకు సాగింది. అయితే ఇది భూభాగాన్ని స్వాధీనం చేసుకోవడం కాదని డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌లు తమ సార్వభౌమాధికారం పదిలంగానే ఉందని స్పష్టం చేశాయి. అసలు మంచు కొండల మధ్య ఉన్న గ్రీన్‌లాండ్‌పై అగ్రరాజ్యం ఎందుకింత ఆసక్తి చూపుతోంది? ఈ కొత్త ఒప్పందం వెనుక అమెరికా అసలు వ్యూహాలేంటి? అన్నది అంతర్జాతీయ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.

వ్యూహాత్మక భౌగోళిక స్థానం

ఉత్తర అమెరికా, యూరప్‌ల మధ్య ఆర్కిటిక్ ప్రాంతంలో విస్తరించి ఉన్న గ్రీన్‌లాండ్, ఉత్తర అట్లాంటిక్ , ఆర్కిటిక్ సము ద్ర మార్గాలపై నిఘా ఉంచడానికి అత్యంత అనుకూలమైన కేంద్రం. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల వల్ల ఆర్కిటిక్ మంచు కరుగుతుండటంతో కొత్త వ్యాపార, నౌకా రవాణా మార్గాలు సుగమమవుతున్నాయి. ఈ మార్గాలపై పట్టు సాధించడం అమెరికాకు అత్యంత కీలకంగా మారింది.

రష్యా, చైనాలకు చెక్ పెట్టే వ్యూహం

ఆర్కిటిక్ ప్రాంతంలో రష్యా, చైనాలు తమ సైనిక, ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తున్నాయి. ప్రత్యర్థి దేశాలు గ్రీన్‌లాండ్‌లో స్థావరాలు ఏర్పాటు చేయకుండా నిరోధించడం.. కీలక రంగాల్లో వారి పెట్టుబడులను అడ్డుకోవడం అమెరికా ప్రధాన లక్ష్యం. అమెరికా ఇప్పటికే గ్రీన్‌లాండ్‌లోని పిటుఫిక్ స్పేస్ బేస్ ద్వారా క్షిపణి రక్షణ, అంతరిక్ష నిఘా సేవలను నిర్వహిస్తోంది. తాజా ఒప్పందంతో అక్కడ తన సైనిక బలగాలను మరింత బలోపేతం చేయనుంది.

లభ్యం కాని సహజ వనరులు.. అరుదైన ఖనిజాలు

గ్రీన్‌లాండ్ మంచు పొరల కింద అపారమైన సహజ వనరులతో పాటు.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అత్యంత అవసరమైన రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ నిక్షేపాలు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. భవిష్యత్తులో వీటికి ఉండే డిమాండ్ దృష్ట్యా ఈ ఖనిజ సంపదపై పట్టు సాధించడం అమెరికా ఆర్థిక, పారిశ్రామిక ప్రయోజనాలకు అత్యవసరం.

కొనుగోలు కాదు... సుదీర్ఘ కాలపు పట్టు

సార్వభౌమాధికారం గ్రీన్‌లాండ్‌దేనని దాని అదుపులో ఉన్న దేశం గ్రీన్ లాండ్ స్పష్టం చేసింది. ట్రంప్ "శాశ్వత నియంత్రణ" అనే పదాన్ని వాడినప్పటికీ ఇది భూభాగ కొనుగోలు కాదని డెన్మార్క్ పార్లమెంట్ స్పష్టం చేసింది. గ్రీన్‌లాండ్ ప్రజల స్వయం నిర్ణయాధికారం, సార్వభౌమాధికారం యథాతథంగా కొనసాగుతాయి. ఒకవేళ భవిష్యత్తులో గ్రీన్‌లాండ్, డెన్మార్క్ నుండి పూర్తి స్వాతంత్ర్యం పొందినా అమెరికా సైనిక ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా ఉండేలా ఈ ఒప్పందానికి రూపకల్పన చేసినట్లు వ్యూహాత్మక విశ్లేషకులు భావిస్తున్నారు.

తుది ఆమోదం ఇంకా బాకీనే..

ఈ ఒప్పందంపై తుది నిర్ణయం జరగాలంటే డెన్మార్క్, గ్రీన్‌లాండ్ పార్లమెంట్ల నుంచి చట్టపరమైన ఆమోదం లభించాల్సి ఉంది. అమెరికా లక్ష్యం గ్రీన్‌లాండ్‌ను తన దేశంలో కలుపుకోవడం కాదు.. ఆర్కిటిక్ ప్రాంతంలో తన దీర్ఘకాలిక సైనిక, వ్యూహాత్మక ప్రాబల్యాన్ని స్థిరపరచుకోవడమేనని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

దేవుడు వర్సెస్ మనిషి !

దేవుడు అనే వాడు ఉన్నాడా. ఇది అతి తెలివి ఎక్కువగా ఉండి ఆలోచించే వారికి కలిగే నిత్య సందేహం. వారికి దేవుడు అంటే భౌతిక రూపంలో కనిపించాలి. అన్ని వస్తువులు కళ్ళకు కనిపించినట్లుగా దేవుడు కూడా ఎదుట సాక్షాత్కరించాలి. అలా అయితేనే తప్ప నమ్మేది లేదు అంటారు వీరు. భౌతిక వాదాన్ని నమ్మే వీరికి దేవుడు లేడు అన్నది ప్రగాఢమైన ఆలోచన. అన్నీ కళ్ళ ముందు ఉన్నాయిగా. దేవుడు కూడా వాటి మాదిరిగా ఎందుకు కనిపించడు అని లాజిక్ పాయింట్ తో ఆస్తికులు అనబడే వారిని వీరు గుచ్చి గుచ్చి ప్రశ్నలు వేస్తూ ఉంటారు. దానికి ఆస్తికులు చెప్పే జవాబులు తర్కానికి అందకపోవడం వల్ల వీరిదే పైచేయి అనుకుంటారు.

సర్వాంతర్యామిగా :
అలాగని ఆస్తికులు చేసే వాదనలో తప్పు ఉందా అంటే అదీ ఎవరూ కాదనలేరు. దేవుడు ఉండకపోతే ఈ సృష్టి ఎలా నడుస్తుంది అన్నది వారి మాట. దేవుడు అత్యంత శక్తిమంతుడు కాబట్టి ఒక్క చోట ఉండడని సర్వాంతర్యామి అని వీరు చెబుతారు. అసలు ఈ రోజుకీ ఎంతగానో అభివృద్ధి చెందినా ఈ ప్రపంచంలో ఇంకా తెలియని వింతలు విశేషాలూ అనేకం ఉన్నాయని అవన్నీ ఏమిటి అని ఆస్తికులు సూటిగానే ప్రశ్నిస్తారు. అందువల్ల దేవుడు ఉన్నాడు అని వారు బలంగా బల్ల గుద్ది మరీ చెబుతారు. పైగా మరో మాట అంటారు దేవుడు అందరి కంటే ఎక్కువ. ఆయన పై స్థాయిలో ఉంటాడు. ఆయన అందరి మాదిరిగా కంటికి కనిపించడు అని అంటారు. దేవుడిని చూడాలి అంటే సామాన్యుడి వల్ల కాదని దానికి సాధన ఒకటి చేయాలని కూడా వీరు గట్టిగా నొక్కి వక్కాణిస్తారు. ఈ చరాచర జగత్తు అంతా సాగేది ఎవరి వల్ల అంటే దేవుడి వల్లనే అని వీరు గట్టిగా వాదించి మరీ వివరిస్తారు.

యుగాల వాదన :
ఇలా దేవుడు ఉన్నారు అనే వారికి లేరు అనే వారికి మధ్య యుగాల బట్టి వాదన కొనసాగుతూనే ఉంటుంది. దేవుడు ఇంతకీ ఉన్నాడా లేడా అన్నది మాత్రం ఎవరూ చెప్పలేని పరిస్థితి. ఎందుకంటే దేవుడు ఉన్నారు అని నమ్మే సగటు జనాలు కూడా ఒక్కోసారి హేతుబద్ధమైన వాదన అని చెప్పే వారి వైపు చూస్తూంటారు. నిజమే కదా దేవుడు ఉంటే కంటికి కనిపించాలి కదా అని అనుకుంటారు. అలాగని వీరు నాస్తికులు కారు, ఆస్తికులే. కానీ సందేహాస్పదులు అన్న మాట. ఇలా దేవుడి విషయంలో లేరన్న వారు ఉన్నారని వాదించే వారు, ఉన్నారా లేరా అని అయోమయంలో పడేవారు వర్గాలుగా చీలి పోయి అందులో పడి కొట్టు మిట్టాడుతుంటారు.

మనుషులు చేసిన దేవుడు :
దేవుడిని మనిషి సృష్టించాడు అని మేధావులు కొందరు అంటారు. సమాజాన్ని కట్టుబాట్లలో ఉంచడానికి ఏదో ఒక భయాన్ని భక్తిని కలుగచేయడానికి ఈ విధంగా దేవుడి స్థానం రూపొందించబడింది అని వారు చెబుతారు. ముందు మనిషి ఆ తరువాతనే దేవుడు అన్నది వీరి నిశ్చితాభిప్రాయం. అంటే మనిషి పుట్టాక దేవుడు పుట్టాడని వీరు నమ్ముతారు. ఇక దేవుడే మనుషులను సృష్టించాడు అని ఎటూ ఆస్తిక జనం చెబుతూనే ఉంటుంది. ఎవరు ఎవరిని సృష్టించినా దేవుడు అన్నది మానసిక భావన అని మనిషి మాత్రమే ఉనికిలో ఉన్నాడు కదా అన్నది వీరి బలమైన థియరీ. ఇలా ఎడతెగని వాదాలు జరుగుతూనే ఉంటున్నాయి. కాలగమనంలో మనిషి కొనసాగుతున్నాడు, దేవుడు మాత్రం యుగాలు గడుస్తున్నా ప్రత్యక్షం కావడం లేదు. దాంతో మనిషే శాశ్వతం అన్న వాదన బలపరచేవారు ఎక్కువ అవుతున్న నేపథ్యం కూడా ఉంది.

ఆ భావన మంచిదే :
దేవుడు అనేది మనిషి మంచి సమాజం కోసం బరితెగించకుండా ఉండే జీవన విధానం కోసం కట్టుబాట్ల కోసం ఏర్పాటు చేసిన ఒక వ్యవస్థ అని అనుకుంటే అందులో తప్పేముంది అన్నది కూడా మరో వాదన. సమాజం ఒక పద్ధతి ప్రకారం నడవాలి కదా. గుంపులుగా మారి సమూహాలుగా చేరి అశాంతికి అలజడికి కారణం అయి తమనే తాము చంపుకునే తీరుగా ఆటవిక విధానంగా సాగే దానిని అరికట్టి అడ్డు కట్ట వేసే ఒక ఆయుధం దేవుడు అన్న భావన అయితే అందులో తప్పేముంది అన్నది కూడా తర్కానికి దగ్గరగా ఉండే వాదన. దేవుడు ఉన్నాడు అన్న భయం ఉన్నపుడే ఇన్ని అకృత్యాలు జరుగుతున్నాయి. లేడు అని ఒక్కసారి ఫిక్స్ అయితే ఈ సమాజం బరితెగింపును ఎవరు ఆపగలరు అన్నది కూడా అతి పెద్ద ప్రశ్న. అందువల్ల దేవుడు ఉన్నాడు అన్న భావన మంచిదే అని అంటున్న వారు అధిక శాతం ఉన్నారు. పైగా దేవుడు అండ ఉంది అన్నది ఒక సానుకూల దృక్పథాన్ని కలిస్తూ జీవితంలో ఎదిగేందుకు దోహదపడినపుడు కష్టాలలో ఊరటను ఇచ్చే మానసిక ఓదార్పు అయినప్పుడు ఆ భావనను ఎందుకు కాదనాలి అన్నది కూడా ఉంది. అయితే దేవుడు పేరుతో చేసే అతి చేష్టలను దూరంగా ఉంచగలిగితేనే ఈ భావనకు ఒక అర్ధం పరమార్ధం చేకూరుతుంది అని అంటున్నారు.

నిద్రలో పిల్లలకు చెమటలు పడుతున్నయా.. ఎట్టి పరిస్థితిలో అశ్రద్ధ చేయొద్దు.. తీసుకోవాలసిన జాగ్రత్తలు ఇవే..!

నిద్రలో చెమట పట్టే పసిపిల్లలుఇంట్లో ఉంటే.. ఆ ఇంటి టైమ్ టేబుల్ పూర్తిగా మారిపోతుంది. పసివాళ్లు నిద్రపోయే టైంకి.. పెద్దవాళ్లు నిద్రపోయే టైంకి చాలా తేడా ఉంటుంది. కానీ కొన్నిసార్లు ఈ టైమ్ టేబుల్ వల్ల మంచే జరుగుతుంది. అంటే పిల్లలు నిద్రపోయేటప్పుడు పెద్దలు మేల్కొనే ఉంటారు కాబట్టి, వాళ్ల కదలికలను ఎప్పటికప్పుడు కనిపెట్టొచ్చు. కొందరు పిల్లలకు నిద్రలో ఒళ్లంతా చెమటలు పడతాయి. అలాంటప్పుడు మాత్రం అమ్మానాన్నలు కాస్త జాగ్రత్తగా ఉండాలి.

కొందరు పిల్లలు విపరీతమైన చెమటలతో అర్ధరాత్రి నిద్రలోంచి మేలుకుంటారు. దాన్నే 'నైట్ స్వెట్స్' అంటారు. కొన్నిరకాల ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు ఇలా జరుగుతుంది. ఆ టైమ్? లో అమ్మానాన్నలు పడే టెన్షన్ అంతాఇంతా కాదు. అసలు ఎందుకు ఇలా జరుగుతోందో? ఏం చేయాలో తోచక బాధపడుతుంటారు. అందువల్ల రాత్రుళ్లు చెమట పట్టడం వంటి విషయాలపై అవగాహన ఉంటే ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. పుట్టుకతో గుండె జబ్బులుదపుట్టుకతో గుండె జబ్బుల బారిన పడిన చిన్నారుల్లో చెమట ఎక్కువగా కనిపిస్తుంది. ముఖ్యంగా రాత్రిపూట వీళ్లకు బాగా చెమట పడుతుంది. అలాగే అడుకునే టైమ్? లో తినేటప్పుడు చెమట పడుతుంది. అయితే నూట ఇరవై మందిలో ఒకరికి ఇటువంటి సమస్య ఎదురవుతుందని స్టడీస్ చెప్తున్నాయి. తల్లి గర్భంలో ఉన్న సమయంలో గుండె ఎదుగుదల సవ్యంగా లేనప్పుడు ఇలా జరుగుతుంది.

స్లీప్ అప్నియా అనే ఒకరకమైన స్థితి వల్ల కూడా చిన్నారులకు నిద్రలో విపరీతమైన చెమటలు పడతాయి. ఇలాంటి పరిస్థితిలో పిల్లలు కనీసం ఇరవై సెకండ్ల పాటు శ్వాస తీసుకోలేకపోతారు. అందువల్ల ఆ చిన్నారి శరీరం శ్వాస తీసుకోవడం కోసం విపరీతంగా కష్టపడుతుంది. స్లీప్ ఆప్నియా అనే ఈ సమస్య ప్రీమెచ్యూర్ బేబీస్ లో ఎక్కువగా కనిపిస్తుంది. ఒకవేళ స్లీప్ అప్నియా సమస్యతో సతమతమవుతున్న పిల్లల శరీరం నీలంగా మారినా, అలాగే గురక సమస్య వచ్చినా వెంటనే డాక్టర్? ను సంప్రదించాలి.

సడెన్ ఇన్ ఫాంట్ సిండ్రోమ్
రాత్రిపూట పిల్లల శరీరంలో వేడి ఎక్కువైపోతే వల్ల సడెన్ ఇన్? ఫాంట్ డెత్ సిండ్రోమ్ కండిషన్ ఏర్పడుతుంది. దీనివల్ల చిన్నారి గాఢ నిద్రలోకి జారుకుంటుంది. తర్వాత మేల్కోవడం చిన్నారికి కష్టంగా మారుతుంది.

హైపర్ హైడ్రోసిస్
చల్లని వాతావరణంలో ఉన్నా కొందరి పిల్లలకు విపరీతమైన చెమటలు పడతాయి. ఈ కండిషన్? ను 'హైపర్ హైడ్రోసిస్' అంటారు. చెమటతో తడిచిన తల, చేతులు, పాదాలు, వంటివి ఈ సమస్యను గుర్తించేందుకు కనిపించే లక్షణాలు. ఇది భయపడాల్సిన పెద్ద ఆరోగ్య సమస్య కాదు. కొన్నిసులభమైన చిట్కాలను పాటించడం ద్వారా ఈ సమస్య నుంచి బయటపడొచ్చు.

ఫ్లూయిడ్స్ తప్పనిసరి
పసిపిల్లలు డీహైడ్రేషన్ సమస్య బారినపడకుండా ఉండేందుకు తగినన్ని ఫ్లూయిడ్స్ ను ఎప్పటికప్పుడు తాగిస్తూ ఉండాలి. అలాగే చిన్నారి నిద్రకు ఉపక్రమించే ముందు కూడా శరీరంలో తగినన్ని ద్రవాలు లేకపోవడంవల్ల చేతులకు చెమటలు పడతాయి. తల్లిపాలు తాగే పిల్లలకు తగినన్ని పాలు పట్టిస్తూ ఉండాలి. అలా అధిక చెమట సమస్య నుంచి పిల్లలను కాపాడొచ్చు.

సరైన విధంగా డ్రెస్ వేయాలి
రాత్రిపూట పిల్లలకు సౌకర్యవంతమైన బట్టలనే తొడగాలి. బ్రీతబుల్ మెటీరియల్ తో తయారైన సాఫ్ట్ డ్రెస్సులను వేస్తే హాయిగా ఆడుకుంటారు. అలాకాకుండా సీజన్? తో సంబంధం లేకుండా స్వెటర్స్ వేయొద్దు. చాలావరకు కేసుల్లో పిల్లలకు టైట్ డ్రెస్సుల వల్లే శ్వాస సమస్యలు వస్తున్నట్లు స్టడీస్ చెప్తున్నాయి..

నైట్ స్వెట్ రాకుండా రూమ్ టెంపరేచర్
పిల్లల్లో నైట్ స్వెట్స్ తగ్గించడానికి రూమ్ టెంపరేచర్ పై దృష్టి పెట్టాలి. గదిలో ఎంత వేడిగా ఉంటే, చిన్నారి శరీరం కూడా అంత వేడిగా మారుతుంది. కాబట్టి రూమ్ టెంపరేచర్ కాస్త చల్లగా ఉండేలా చూసుకోవాలి. కొంతమంది మెత్తగా ఉండాలని ఉయ్యాలలో నాలుగైదు బొంతలు వేస్తుంటారు. అలాకాకుండా అనవసరంగా అనిపించే దుప్పట్లను తీసేయాలి. అప్పుడు పిల్లలు హాయిగా నిద్రపోతారు. పైగా చెమటలు కూడా పట్టవు.

ఎప్పుడూ మగతగా, బద్ధకంగా ఉంటుందా..? ఏ పని చేయాలన్నా ఓపిక ఉండట్లేదా..? అయితే కారణం ఇదే..!

మనం ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి కావాల్సిన పోషకాలు తప్పనిసరిగా అందించాలి. అటువంటి పోషకాల్లో ముఖ్యమైనవి విటమిన్లు. విటమిన్ ఞా,దీ, జ, ఐ, జు, ఖ, దీ1, దీ6, దీ12 ఇలా అనేక రకాల విటమిన్లు మన శరీరంలోకి వెళితేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. వీటిని సరియైన మోతాదులో రోజు శరీరానికి అందిస్తేనే ఆరోగ్యంగా ఉంటాం. విటమిన్ లోపం ఉన్నట్లయితే శరీరంలో అనేక మార్పులు జరుగుతాయి. ఓపిక ఉండదు. మన పనులు మనం చేసుకోవడమే కష్టంగా మారుతుంది.

శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచే ముఖ్యమైన విటమిన్లలో ఐ విటమిన్ ఒకటి. ఈ ఐ విటమిన్ లోపిస్తే ఆరోగ్యం గాడి తప్పినట్టే. ఐ విటమిన్ లోపిస్తే ఎప్పుడూ మగతగా ఉంటుంది. బాగా చిరాకుగా ఉంటుంది. చిరాకు, కోపం, అసహనం ఉంటాయి. బద్ధకంగా ఉంటుంది. ఏ పని చేయడానికి శరీరం సహకరించదు. ఎనర్జీ కోల్పోయినట్లు అనిపిస్తుంది. కొందరికి ఒళ్లు నొప్పులు కూడా బాధిస్తాయి. చర్మం పొడిబారడం, దురదగా అనిపించడం, కొందరికి జుట్టు రాలిపోయే ప్రమాదం కూడా ఉంది.

డీ-విటమిన్ లోపంతో ఇబ్బంది పడుతున్న వాళ్లు.. రోజూ తినే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకుని ఈ పరిస్థితి నుంచి బయటపడొచ్చు. సోయాబీన్, గుడ్లు, చీజ్, సీజనల్ పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, చేపల్లో డి విటమిన్ పుష్కలంగా ఉంటుంది. తినేది తక్కువే అయినా పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలి.పొద్దున్నే వచ్చే సూర్య కిరణాల్లో డీ-విటమిన్ పుష్కలంగా ఉంటుంది. మన శరీరంపై ఈ సూర్య కిరణాలు పడేలా ఉదయాన్నే నిద్ర లేచిన వెంటనే కాసేపు ఎండలో నిల్చోవాలి. ఇలా కొన్నికొన్ని పాటించడం వల్ల డీ-విటమిన్ లోపం నుంచి బయటపడొచ్చు.

నైజాంలో ఓపెన్ అయిన 'ది ప్యారడైజ్' అడ్వాన్స్ బుకింగ్స్.. మార్నింగ్ షో ఎన్ని గంటలకు ఉందంటే..

తెలంగాణలో నాని లేటెస్ట్ మూవీ 'ది ప్యారడైజ్' సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. నైజాంలో 'మైత్రీ మూవీ మేకర్స్' ఈ సినిమాను విడుదల చేస్తుంది. 'బుక్ మై షో'లో కాకుండా డిస్ట్రిక్ట్ యాప్?లో ఎక్స్ క్లూజివ్?గా టికెట్లను అందుబాటులో ఉంచారు. మైత్రీ థియేటర్లతో పాటు మరికొన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లను డిస్ట్రిక్ట్ యాప్?లో ఉంచారు. 50 రూపాయల టికెట్ వంద రూపాయలు, వంద రూపాయల టికెట్ 150 రూపాయలు, బాల్కనీ టికెట్?ను 200 రూపాయలకు అమ్ముతున్నారు. జీఎస్టీ, ఇతర వడ్డింపులు అదనం. మార్నింగ్ షో ఉదయం 8 గంటలకు ఉంది. నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 24న వరల్డ్వైడ్గా సినిమా విడుదల కానుంది. ఇదొక తల్లీకొడుకుల కథ. ఒక సవారీ జాతి కథ. ప్రతి ఒక్కరికీ డిఫరెంట్ ఎక్స్పీరియెన్స్ ఇస్తుందని మేకర్స్ నమ్మకంతో ఉన్నారు."చరిత్రలో అందరూ చిలుకలు, పావురాల గురించి రాసిన్రు గానీ గదే జాతిలో పుట్టిన కాకుల గురించి రాయలేదు. ఇది కడుపు మండిన కాకుల కథ. జమానా జమానా కెళ్ళి నడిచే శవాల కథ. అమ్మరొమ్ములో పాలు లేక రక్తం బోసి పెంచిన ఒక జాతి కథ. ఒక దగడ్ వొచ్చి మొత్తం జాతిలో జోష్ తెచ్చిండు.

థూ.. అనిపించుకున్న కాకులు తల్వార్లు పట్టినాయ్. ఇది ఆ కాకులని ఒక్కటి చేసిన తిరుగుబాటుదారుడి కథ.. నా కొడుకు నాయకుడు అయిన కథ" అని పవర్ఫుల్ వాయిస్ ఓవర్తో వచ్చిన గ్లింప్స్, 'ఆయా షేర్' సాంగ్, 'ఏషనాగుల' సాంగ్, టీజర్.. ఈ నాలుగూ నాని, శ్రీకాంత్ ఓదెల 'ప్యారడైజ్' సినిమాకు మంచి బజ్ తెచ్చిపెట్టాయి. ప్రేక్షకుల్లో ఈ సినిమాపై విపరీతమైన అంచనాలున్నాయి.

నోరూరించే బంగాళ దుంపల జిలేబీ.. టేస్ట్ అదిరిపోవాల్సిందే.. ఎలా తయారుచేయాలంటే..





జిలేబీ అనగానే జనాలకు నోట్లో నీళ్లు ఊరతాయి. తియ్య తియ్యగా.. వేడి వేడిగా.. కరకరలాడుతూ ఉంటాయి. జిలేబీలను సాధారణంగా మైదా పిండితో తయారు చేస్తారు. కాని వెరైటీగా బంగాళదుంప జిలేబీ ఎప్పుడైనా ట్రై చేశారా... చాలా స్వీట్? గా కరకరలాడుతూ ఉంది. రుచి అదిరిపోవాల్సిందే.. మరి అంత టేస్టీగా ఉండే పొటాటో జిలేబీ ని ఎలా తయారు చేయాలో తెలుసుకుందాం. . .!

ఆలూ జిలేబీ తయారీకి కావలసిన పదార్థాలు

మైదా పిండి – 100 గ్రాములు
బంగాళదుంపలు – 2 (ఉడికించినవి)
పెరుగు – అర కప్పు
ఫ్రూట్ సాల్ట్ (ఈనో) – పావు టీస్పూన్
నూనె – డీప్ ఫ్రైకి సరిపడా
కుంకుమపువ్వు – చిటికెడు
యాలకుల పొడి – పావు టీస్పూన్
పంచదార – 1 కప్పు

పొటాటో జిలేబీ తయారీ విధానం

ముందుగా వెడల్పాటి గిన్నెను స్టవ్? పై పెట్టి వెలిగించాలి. ఆ గిన్నెలో పంచదార వేసి పాకం వచ్చేందుకు నీళ్లుపోసి మరిగించాలి. మంచి రుచి.. వాసనకు మరుగుతున్నప్పుడు అందులో యాలకుల పొడి, కుంకుమ పువ్వు వేయాలి. ఓ ఐదు నిమిషాలపాటు అంటే తీగ పాకంలా.. జిగురులా వచ్చేలా మరిగించాలి. జిలేబీకీ పాకం మరీ చిక్కగా ఉండకూడదు. ఇలా తయరైన తరువాత స్టవ్? ను ఆపేయాలి. ఇప్పుడు పెద్ద బౌల్ లో ఉడికించిన బంగాళదుంపలను మెత్తగా చేయాలి. మెత్తగా అయిన ఈ మిశ్రమంలో మైదా పిండి, పెరుగు, ఫ్రైట్? సాల్ట్? వేసి నీళ్లు పోసుకుంటూ ఉండలు లేకుండా బాగా కలుపుకోవాలి. ఈ పిండి మరీ గట్టిగా ఉండకూడదు. అలాగని మరీ పల్చగా కూడా ఉండకూడు. జిలేబీలు తయారు చేసేందుకు వీలుగా ఉండేలా మధ్యస్థంగా ఉండేలా బాగా కలుపుకోవాలి. పిండి రడీ అయిన తరువాత మళ్లీ స్టవ్? వెలిగించి కళాయిలో నూనె పోసి వేడిచేయాలి. ఇప్పుడు ఒక శుభ్రమైన పల్చటి కాటన్ క్లాత్? తీసుకొని అందులో కొద్దిగా(జిలేబీ సైజుకు సరిడడా) పిండిని తీసుకొని గుండ్రంగా చేసి పైన పట్టుకోవాలి. అడుగున చిన్న రంధ్రం చేయాలి. నూనె వేడెక్కిన తరువాత పిండిని గుండ్రంగా తిప్పుతూ జిలేబీ ఆకారంలో నూనెలో వేగించాలి. ఇవి రెండు వైపులా బంగారు రంగులోకి వచ్చేలా మీడియం ఫ్లేమ్? పై వేయించాలి.

ఇప్పుడు ఈ జిలేబీలను ముందుగా తయారు చేసుకున్న పాకం ఉన్న గిన్నెలో వేసి రెండు మూడు నిమిషాల పాటు నానపెట్టాలి. ఇప్పుడు ఈ జిలేబీలు పాకాన్ని బాగా పీల్చుకొని చాలా అందంగా తయారవుతాయి. అంతే జ్యూసీగా.. టేస్టీగా ఉండే బంగాళదుంపల జిలేబీ రడీ.. వీటిని పిల్లలే కాదు.. పెద్దలు కూడా చాలా ఇష్టంగా తింటారు. మరి ఇంకెందుకు ఆలస్యం.. ఇంటికి ఎవరైనా అతిథులు వచ్చినప్పుడు బంగాళదుంపల జిలేబీని ట్రై చేయండి.. మీరు జీవితాంతం గుర్తిండిపోతారు.

ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే రన్నింగ్..

కొత్తగా ప్రారంభించేవారు తెలుసుకోవాల్సిన విషయాలు ఇవే..

పరుగెత్తడం శారీరక దృఢత్వాన్ని పెంచడంతోపాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచే అత్యంత సులభమైన వ్యాయామాల్లో ఒకటి. క్రమం తప్పకుండా పరుగెత్తడం వల్ల శరీర సహనశక్తి పెరగడమే కాకుండా, టైప్ 2 డయాబెటిస్, పక్షవాతం వంటి వ్యాధుల ప్రమాదం తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే మానసిక ఒత్తిడి తగ్గి రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు కూడా ఇది సహాయపడుతుంది. అయితే మొదటిసారి రన్నింగ్ ప్రారంభించేవారు కొన్ని ముఖ్యమైన విషయాలను తెలుసుకుని ముందుకు సాగితే గాయాల ప్రమాదం తగ్గి మంచి ఫలితాలు పొందవచ్చు.పరుగెత్తడం ప్రారంభించే ముందు సరైన రన్నింగ్ షూస్‌ను ఎంపిక చేసుకోవడం చాలా ముఖ్యం. ప్రతి ఒక్కరి పాదాల ఆకృతి, నడక తీరు భిన్నంగా ఉంటుంది. అందుకే రన్నింగ్‌కు అనువైన షూస్ ను నిపుణుల సలహాతో ఎంపిక చేసుకుంటే పాదాలు, చీలమండలు, మోకాళ్లపై అనవసర ఒత్తిడి పడకుండా ఉంటుంది.

దుస్తులు, సమయం..

రన్నింగ్ సమయంలో ధరించే దుస్తులు కూడా పనితీరుపై ప్రభావం చూపుతాయి. చెమటను త్వరగా బయటకు పంపే సింథటిక్ ఫ్యాబ్రిక్‌తో తయారైన దుస్తులు ఉపయోగించడం మంచిది. పూర్తిగా కాటన్‌తో తయారైన దుస్తులు చెమటను నిల్వ ఉంచి చర్మం చికాకు, వాపులు వంటి సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉంటుంది. ప్రారంభంలోనే ఒక స్పష్టమైన ప్రణాళికను రూపొందించుకోవాలి. మొదట ఒక నిమిషం పరుగెత్తి, ఐదు నిమిషాలు నడిచే విధానంతో ప్రారంభించడం ఉత్తమం. క్రమంగా శరీరం అలవాటు పడిన తర్వాత పరుగెత్తే సమయాన్ని పెంచుకోవచ్చు. ముఖ్యంగా రూపొందించుకున్న ప్రణాళికను క్రమం తప్పకుండా పాటించడం విజయానికి కీలకం. మొదటి రోజే ఎక్కువ దూరం లేదా ఎక్కువ సమయం పరుగెత్తేందుకు ప్రయత్నించకూడదు. చిన్న చిన్న వ్యవధులతో ప్రారంభించి, తర్వాత క్రమంగా దూరాన్ని, వేగాన్ని పెంచుకోవాలి. చాలా వేగంగా ప్రారంభించడం వల్ల మోకాళ్లు, చీలమండలపై ఒత్తిడి పెరిగి గాయాలకు అయ్యే ప్రమాదం ఉంటుంది.

తగినంత నీరు అవసరం..

రన్నింగ్ చేసే ముందు శరీరంలో తగినంత నీరు ఉండేలా చూసుకోవాలి. పరుగెత్తడానికి రెండు గంటల ముందు కనీసం అర లీటర్ నీరు తాగడం మంచిది. ఎక్కువసేపు పరుగెత్తే సమయంలో కూడా అవసరాన్ని బట్టి నీరు తాగడం వల్ల డీహైడ్రేషన్ సమస్య రాకుండా ఉంటుంది. పరుగెత్తే ముందు వార్మప్ చేయడం తప్పనిసరి. ఐదు నిమిషాలు నడవడం లేదా తేలికపాటి స్ట్రెచింగ్, వార్మప్ వ్యాయామాలు చేయడం ద్వారా కండరాలు సడలిపోతాయి. దీంతో గాయాల ప్రమాదం తగ్గి శరీరం పరుగుకు సిద్ధమవుతుంది. రన్నింగ్‌తోపాటు విశ్రాంతి కూడా అంతే అవసరం. వ్యాయామం చేసిన తర్వాత కండరాలు కోలుకోవడానికి శరీరానికి సమయం ఇవ్వాలి. ప్రారంభ దశలో ఒక రోజు పరుగెత్తి, మరుసటి రోజు విశ్రాంతి తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

ఇతర వ్యాయామాలు కూడా చేస్తే..

రన్నింగ్‌తో పాటు ఇతర వ్యాయామాలు కూడా చేయడం ఉపయోగకరం. సైక్లింగ్, ఈత, యోగా లేదా ఇతర క్రీడల్లో పాల్గొనడం వల్ల శరీర సమతుల్యత మెరుగుపడుతుంది. అలాగే ఒకే రకమైన వ్యాయామం వల్ల కండరాలపై పడే ఒత్తిడి కూడా తగ్గుతుంది. కొన్ని రోజులు అలసటగా అనిపించినా లేదా బద్ధకంగా ఉన్నా రన్నింగ్‌ను పూర్తిగా మానేయకూడదు. ఒక రోజు వాయిదా వేయడం అలవాటై, తర్వాత పూర్తిగా ఆపివేసే పరిస్థితి రావచ్చు. అందుకే క్రమశిక్షణతో వ్యాయామాన్ని కొనసాగించడం చాలా ముఖ్యం. ఎప్పుడూ ఒకే విధంగా పరుగెత్తకుండా అప్పుడప్పుడు మార్పులు చేసుకోవాలి. కొన్నిసార్లు స్ప్రింట్లు, మరికొన్నిసార్లు నెమ్మదిగా జాగింగ్ చేయడం మంచిది. అలాగే ప్రతిరోజూ ఒకే ప్రదేశంలో కాకుండా పార్కులు, కొండ ప్రాంతాలు వంటి కొత్త ప్రదేశాల్లో పరుగెత్తడం వల్ల ఆసక్తి పెరగడంతోపాటు సహనశక్తి, కండరాల బలం కూడా మెరుగుపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

పసుపు తెలుపు రంగులోనూ ఉంటుందని మీకు తెలుసా..

దాంతో ఎలాంటి లాభాలు కలుగుతాయంటే..?

తెల్ల పసుపు (వైట్ టర్మరిక్) లేదా జెడోయరీ భారతీయులకు పెద్దగా పరిచయం లేని అరుదైన సుగంధ ద్రవ్యం. మన దేశంలో ఎక్కువగా పసుపు రంగు పసుపును పండిస్తారు. అందువల్ల తెల్ల పసుపు చాలా తక్కువగా కనిపిస్తుంది. ఇది అల్లంలా కనిపించినప్పటికీ, ప్రత్యేకమైన ఔషధ గుణాలు కలిగిన దుంప. శాస్త్రీయంగా దీనిని కుర్కుమా జెడోయారియా (Curcuma zedoaria) అని పిలుస్తారు. కొన్ని భారతీయ భాషల్లో దీనిని అంబా పసుపు అని కూడా అంటారు. మామిడి, పసుపు కలిసినట్లుగా ఉండే సువాసన దీని ప్రత్యేకత. తెల్ల పసుపు బయటకు గోధుమరంగు తొక్కతో, లోపల నారింజ లేదా లేత పసుపు రంగులో గట్టి దుంపలా ఉంటుంది. అల్లంలా కనిపించినప్పటికీ, ఇది పసుపు కుటుంబానికి చెందిన మొక్క. సాధారణంగా పొడి రూపంలో, ఎండబెట్టిన ముక్కలుగా లేదా తాజాగా మార్కెట్‌లో లభిస్తుంది. భారతీయ వంటల్లో తెల్ల పసుపును తాజాగా వాడటమే కాకుండా ఊరగాయల తయారీలో కూడా ఉపయోగిస్తారు. ఇండోనేషియా వంటి దేశాల్లో దీనిని ఎండబెట్టి కరివేపాకు పొడులు, ముఖ్యంగా సముద్ర ఆహార కూరల్లో మసాలాగా ఉపయోగిస్తారు.

యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు..

తెల్ల పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ (వాపులను తగ్గించే), యాంటీ మైక్రోబియల్ (సూక్ష్మక్రిములను నిరోధించే) గుణాలు ఉంటాయి. అందువల్ల జీర్ణకోశం, శ్వాసకోశానికి సంబంధించిన కొన్ని సమస్యలను తగ్గించడంలో ఇది సహాయపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణక్రియ సరిగా లేకపోవడం, గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలను తగ్గించడంలో తెల్ల పసుపు ఉపయోగపడుతుంది. జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో ఇది సహాయకారిగా ఉంటుంది. తెల్ల పసుపులో ఉండే వాపు నిరోధక గుణాలు కీళ్ల వాపు, ఆర్థరైటిస్ వంటి సమస్యలతో బాధపడేవారికి కొంత ఉపశమనం కలిగిస్తాయి. అలాగే చిన్న గాయాలు, కొన్ని చర్మ సమస్యల నుంచి కోలుకోవడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే కుర్కుమెనోల్ అనే సమ్మేళనం నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

యాంటీ ఆక్సిడెంట్లు అధికం..

ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు శరీర కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే ఇందులో ఉండే కుర్కుమిన్ వంటి సమ్మేళనాలు అలెర్జీ ప్రతిచర్యలను ప్రేరేపించే కొన్ని రసాయనాల విడుదలను తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. శ్వాసకోశ ఆరోగ్యానికి కూడా తెల్ల పసుపు ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. ఊపిరితిత్తుల్లో కఫం, శ్లేష్మం పేరుకుపోవడం వల్ల ముక్కు మూసుకుపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, జలుబు, ఆస్తమా వంటి సమస్యలు తలెత్తితే, తెల్ల పసుపులోని కొన్ని గుణాలు ఈ సమస్యలను తగ్గించడంలో తోడ్పడతాయని నిపుణులు చెబుతున్నారు. అయితే తెల్ల పసుపుపై జరిగిన పరిశోధనలు ఇంకా పరిమితంగానే ఉన్నాయి. కాబట్టి దీనిని ఆరోగ్య ప్రయోజనాల కోసం అధికంగా తీసుకునే ముందు వైద్యులు లేదా పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. సమతుల్య ఆహారంలో భాగంగా ఊరగాయలు, టీ లేదా కూరల్లో పరిమిత మోతాదులో చేర్చుకోవడం ద్వారా దీని రుచి, పోషక ప్రయోజనాలను పొందవచ్చు.

అసలు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అంటే ఏమిటి.. వీటి వల్ల ఎలాంటి లాభాలు కలుగుతాయి, వేటిని తీసుకోవాలి..

ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు శరీరానికి అత్యంత అవసరమైన ఆరోగ్యకరమైన కొవ్వులలో ఒకటి. ఇవి మెదడు పనితీరు, గుండె ఆరోగ్యం, శరీర కణాల పనితీరుకు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే శరీరం ఈ ముఖ్యమైన కొవ్వులను స్వయంగా తయారు చేసుకోలేదు. అందుకే ఆహారం ద్వారా తప్పనిసరిగా తీసుకోవాలి. సమతుల్య ఆహారంలో ఒమెగా 3 సమృద్ధిగా ఉండే పదార్థాలను చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. ఒమెగా3 ఫ్యాటీ యాసిడ్లు శరీరంలో వాపులను తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఇవి కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇవి మెదడు ఆరోగ్యానికి కూడా ఎంతో ఉపయోగపడతాయి. అందుకే రోజువారీ ఆహారంలో ఒమెగా 3 అధికంగా ఉండే ఆహారాలను చేర్చాలని నిపుణులు సూచిస్తున్నారు.

చేపలు, చియా విత్తనాలు..

సాల్మన్ చేప ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లకు అత్యుత్తమ వనరులలో ఒకటి. ఇందులో ఒమెగా 3తోపాటు ప్రోటీన్, పొటాషియం, సెలీనియం వంటి ముఖ్యమైన పోషకాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. క్రమం తప్పకుండా చేపలు తినేవారికి ఇది మంచి ఎంపికగా నిలుస్తుంది. చియా గింజలు కూడా ఒమెగా 3కి అద్భుతమైన వనరు. వీటిని స్మూతీలు, మిల్క్‌షేక్‌లు, పెరుగు లేదా ఓట్స్‌లో కలిపి తీసుకోవచ్చు. అలాగే ధాన్యాలకు ప్రత్యామ్నాయంగా కూడా వీటిని ఉపయోగించవచ్చు. చిన్న పరిమాణంలోనే ఎక్కువ పోషకాలు అందించే గింజలలో చియా గింజలు ముఖ్యమైనవి. వాల్‌నట్స్‌లో ఒమెగా 3తో పాటు యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉంటాయి. వీటిని ఆరోగ్యకరమైన స్నాక్‌గా తీసుకోవచ్చు. రోజూ కొద్దిపాటి వాల్‌నట్స్ తినడం వల్ల గుండె ఆరోగ్యానికి మేలు కలగడమే కాకుండా శరీరానికి అవసరమైన మంచి కొవ్వులు కూడా అందుతాయి.

అవిసె గింజలు, సోయాబీన్స్..

అవిసె గింజలు (ఫ్లాక్స్‌సీడ్స్) సూపర్‌ఫుడ్‌గా గుర్తింపు పొందాయి. వీటిలో ఒమెగా 3తో పాటు ఫైబర్, ఇతర ముఖ్యమైన పోషకాలు కూడా ఉంటాయి. ఇవి ఆకలిని నియంత్రించడంలో, తీపి పదార్థాలపై కోరికను తగ్గించడంలో, బరువు నియంత్రణకు సహాయపడటంలో ఉపయోగపడతాయి. వీటిని పొడి చేసి చపాతీ పిండి, పెరుగు లేదా స్మూతీల్లో కలిపి తీసుకోవచ్చు. సోయాబీన్స్ కూడా ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లకు మంచి వనరు. ముఖ్యంగా ఇందులో ఉండే ఆల్ఫా–లినోలెనిక్ యాసిడ్ గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి తోడ్పడుతుంది. సోయాబీన్స్‌ను వివిధ వంటకాల రూపంలో ఆహారంలో చేర్చుకోవచ్చు. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్ల లోపం వల్ల చర్మం పొడిబారడం, మూడ్ మార్పులు, జ్ఞాపకశక్తి తగ్గడం, అలసట వంటి సమస్యలు కనిపించే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలికంగా లోపం కొనసాగితే గుండె ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంటుంది. అందువల్ల చియా గింజలు, వాల్‌నట్స్, అవిసె గింజలు, సోయాబీన్స్, సాల్మన్ వంటి ఒమెగా 3 అధికంగా ఉండే ఆహారాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన ఈ ముఖ్యమైన పోషకాన్ని పొందడంతోపాటు మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని ఆరోగ్య నిపుణులు తెలియజేస్తున్నారు.

ఉదయం అల్పాహారంలో పాలు లేదా నారింజ రసం.. ఏది ఉత్తమ ప్రయోజనాలను ఇస్తుంది..?

పొద్దున్నే అల్పాహారం రోజంతా శరీరానికి శక్తిని అందించే అత్యంత ముఖ్యమైన భోజనం. రాత్రంతా ఉపవాసం చేసిన తర్వాత శరీరానికి పోషకాలు, శక్తిని అందించే ఆహారం అవసరం. అల్పాహారంలో పాలు తాగాలా? లేక నారింజ రసం తాగాలా? అనే సందేహం చాలా మందికి ఉంటుంది. ఈ రెండింటికీ ప్రత్యేకమైన పోషక విలువలు ఉన్నప్పటికీ, ఆరోగ్యపరంగా కొన్ని లాభాలు, నష్టాలు కూడా ఉన్నాయి. పాలను అల్పాహారంలో తీసుకోవడం వల్ల శరీరానికి మంచి నాణ్యమైన ప్రోటీన్ అందుతుంది. ఒక గ్లాస్ పాలలో రోజువారీ అవసరమైన ప్రోటీన్‌లో సుమారు 20 శాతం వరకు లభిస్తుంది. ఈ ప్రోటీన్ ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగించి మధ్య మధ్యలో చిరుతిళ్లు తినాలనే కోరికను తగ్గించడంలో సహాయపడుతుంది. దీంతో మధ్యాహ్న భోజన సమయంలో అతిగా తినే అవకాశం కూడా తగ్గుతుంది. అంతేకాకుండా పాలలో ఉండే కాల్షియం శరీర బరువును నియంత్రించడంలో సహాయపడే కొన్ని హార్మోన్ల పనితీరుకు తోడ్పడుతుంది.

పాలను తాగితే ఏం జరుగుతుంది..

అయితే పాలకు కొన్ని ప్రతికూల అంశాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా పూర్తి కొవ్వు (ఫుల్ ఫ్యాట్) ఉన్న పాలలో శాచురేటెడ్ ఫ్యాట్ ఎక్కువగా ఉంటుంది. దీన్ని అధికంగా తీసుకోవడం వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరిగే అవకాశం ఉంటుందని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా మధుమేహం లేదా ఊబకాయం ఉన్నవారు పాల రకాన్ని ఎంపిక చేసుకునేటప్పుడు జాగ్రత్త వహించాలి. నారింజ రసం కూడా అల్పాహారంలో చాలామంది ఇష్టంగా తీసుకునే పానీయం. ఒక గ్లాస్ నారింజ రసం ద్వారా శరీరానికి రోజుకు అవసరమైన విటమిన్ సి దాదాపు పూర్తిగా అందుతుంది. విటమిన్ సి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి చర్మాన్ని సూర్యకిరణాల వల్ల కలిగే నష్టాల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. అలాగే వాతావరణ కాలుష్యం వల్ల మెదడుపై పడే ప్రతికూల ప్రభావాలను తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

నారింజ రసం సేవిస్తే..

అయితే నారింజ రసాన్ని తరచూ లేదా ఎక్కువసేపు కొద్దికొద్దిగా తాగడం వల్ల దంతాల పైపొర (ఎనామెల్) దెబ్బతినే అవకాశం ఉంటుంది. అలాగే పండ్ల రసాల్లో సహజ చక్కెరలు ఎక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి ఇవి పరిమిత మోతాదులోనే మంచివి. అందుకే పండ్లను నేరుగా తినడం, రసాన్ని మాత్రం అప్పుడప్పుడు మాత్రమే తీసుకోవడం ఉత్తమం. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. అల్పాహారంలో పండ్ల రసాల కంటే పాలు మెరుగైన ఎంపికగా పరిగణించవచ్చు. ముఖ్యంగా సేంద్రియ (ఆర్గానిక్) పాలు తీసుకుంటే విటమిన్ ఇ, ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు కొంత ఎక్కువగా లభించే అవకాశం ఉంటుంది. అదే సమయంలో నారింజ రసాన్ని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. అయితే దానిని కొద్దికొద్దిగా ఎక్కువసేపు తాగకుండా, ఒకేసారి తాగడం వల్ల దంతాలపై ఆమ్ల ప్రభావం తగ్గుతుంది. అలాగే సమతుల్యమైన అల్పాహారంతోపాటు తీసుకుంటే దాని పోషక ప్రయోజనాలను కూడా పొందవచ్చు.

టీమిండియాతో ఇంత త్వరగా టీ20 మ్యాచ్.. జపాన్ కోచ్ ఆశ్చర్యం

- భారత్‌తో మ్యాచ్ జరగనుందని నెల క్రితం వరకు తమకు తెలియదని చెప్పిన జపాన్ కోచ్
- ప్రధానుల స్థాయిలో జరిగిన చర్చల ఫలితంగానే ఈ మ్యాచ్ సాధ్యమైందని వెల్లడి
- ప్రపంచ ఛాంపియన్‌తో ఆడటం తమకు దక్కిన అద్భుతమైన అవకాశమని వ్యాఖ్య
- ఈ మ్యాచ్ ద్వారా జపాన్‌లో భవిష్యత్ తరాలకు స్ఫూర్తినివ్వడమే తమ లక్ష్యమన్న కోచ్

హైదరాబాద్ పెన్ పవర్: ప్రపంచ ఛాంపియన్ భారత్‌తో టీ20 మ్యాచ్ ఆడతామనే విషయం నెల రోజుల క్రితం వరకు తమకు కనీసం తెలియదని జపాన్ క్రికెట్ జట్టు హెడ్ కోచ్ డుగాల్ బెడింగ్‌ఫీల్డ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఇదొక ఊహించని, అద్భుతమైన అవకాశమని అభివర్ణించాడు. ఇరు దేశాల ప్రధానుల స్థాయిలో జరిగిన ఉన్నతస్థాయి చర్చల తర్వాతే ఈ మ్యాచ్ హఠాత్తుగా ఖరారైందని బెడింగ్‌ఫీల్డ్ వెల్లడించాడు. ఈ చారిత్రక మ్యాచ్ కోసం తమ జట్టు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తోందని తెలిపాడు. మంగళవారం టోచిగి ప్రిఫెక్చర్‌లోని సానో అంతర్జాతీయ క్రికెట్ గ్రౌండ్‌లో సుజుకి కప్ కోసం భారత్, జపాన్ జట్ల మధ్య ఈ టీ20 మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఈ మ్యాచ్ టికెట్లన్నీ అమ్ముడయ్యాయి. మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న ఆసియా క్రీడలకు సన్నాహకంగా ఈ మ్యాచ్ ఉపయోగపడనుంది. ఆసియా క్రీడల్లో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌లో ఆడనుండగా, జపాన్ తన తొలి మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో తలపడనుంది. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో ప్రత్యేకంగా మాట్లాడుతూ బెడింగ్‌ఫీల్డ్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "ఈ మ్యాచ్ గురించి విన్నప్పుడు మొదట నమ్మలేకపోయాం. ఇది వందకు వంద శాతం మాకు ఆశ్చర్యం కలిగించింది. ప్రపంచ నంబర్ వన్ జట్టుతో ఆడేందుకు ఇదొక అద్భుతమైన అవకాశం. జపాన్‌లో నివసిస్తున్న భారతీయులు కూడా ఈ మ్యాచ్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మైదానంలో గొప్ప వాతావరణం ఉంటుందని ఆశిస్తున్నాం" అని అన్నాడు.

అయితే, జట్టు సన్నద్ధతకు కొన్ని సవాళ్లు ఉన్నాయని బెడింగ్‌ఫీల్డ్ అంగీకరించాడు. "మా ఆటగాళ్లు దేశవిదేశాల్లోని వివిధ ప్రాంతాల్లో ఉంటారు. మే నెల తర్వాత మా పూర్తి జట్టు కలిసి శిక్షణ తీసుకుంది ఇప్పుడే. టెక్నాలజీ సాయంతో ఆటగాళ్లను సమన్వయం చేస్తున్నాం. మరోవైపు, వర్ష సూచన కూడా ఆందోళన కలిగిస్తోంది. అయినా, మ్యాచ్ సజావుగా సాగుతుందని ఆశిస్తున్నాం" అని తెలిపాడు.

భారత జట్టు ఫైర్‌పవర్‌ను ఎదుర్కోవడం పెద్ద సవాలని బెడింగ్‌ఫీల్డ్ పేర్కొన్నాడు. "భారత్ వంటి మేటి జట్ల ఆటగాళ్ల విధ్వంసక శక్తి ముందు కొన్నిసార్లు చిన్న జట్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అయితే, ఈ ఒత్తిడిని అధిగమించి, మైదానంలో గట్టి పోటీ ఇవ్వాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం"

అని వివరించాడు. 2020లో అండర్-19 ప్రపంచకప్‌లోనూ భారత జట్టుతో తలపడిన అనుభవాన్ని గుర్తుచేసుకున్నాడు. ఆనాడు యశస్వి జైస్వాల్, రవి బిష్ణోయ్ వంటి ఆటగాళ్లున్న భారత జట్టు చేతిలో తమ జట్టు ఓడిపోయిందని, అది గొప్ప అనుభవమని అన్నాడు. ఇప్పుడు సీనియర్ల స్థాయిలో మరోసారి భారత్‌తో ఆడటం ఆసక్తికరంగా ఉందని తెలిపాడు. ఈ మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా, జపాన్‌లో క్రికెట్‌కు ప్రాచుర్యం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని బెడింగ్‌ఫీల్డ్ స్పష్టం చేశాడు. "మా ప్రదర్శన ద్వారా జపాన్‌లో భవిష్యత్ తరాల క్రీడాకారులకు స్ఫూర్తినివ్వాలనుకుంటున్నాం. వేలాది మంది పిల్లలు క్రికెట్‌ను తమ క్రీడగా ఎంచుకునేలా చేయడమే మా అంతిమ లక్ష్యం" అని తెలిపాడు. భారత్-జపాన్ దౌత్య సంబంధాల 75 వసంతాల వేడుకలో భాగంగా ఈ మ్యాచ్ ఏర్పాటు చేశారు. సెప్టెంబరు 22న జపాన్ లోని సానో ఇంటర్నేషనల్ గ్రౌండ్ లో ఈ చారిత్రక మ్యాచ్ జరగనుంది.

టీ20 క్రికెట్‌లో స్మృతి మంధాన సంచలనం.. బాబర్, బట్లర్‌లను వెనక్కి నెట్టి ప్రపంచ రికార్డు!

హైదరాబాద్ పెన్ పవర్: భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తన కెరీర్‌లో మరో అద్భుతమైన మైలురాయిని అందుకుంది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. పురుషులు, మహిళల క్రికెట్‌లో కలిపి అత్యధిక పరుగులు సాధించిన క్రీడాకారిణిగా ఆమె ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఆసియా క్రీడల సెమీఫైనల్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ అరుదైన ఘనతను ఆమె సొంతం చేసుకుంది. కొరోగి స్పోర్ట్స్ పార్క్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో మంధాన కేవలం 19 బంతుల్లో 37 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. ఈ క్రమంలో న్యూజిలాండ్ మాజీ క్రీడాకారిణి సూజీ బేట్స్ పేరిట ఉన్న రికార్డును ఆమె అధిగమించింది. ఈ మ్యాచ్‌కు ముందు మంధాన 170 ఇన్నింగ్స్‌లలో 4,751 పరుగులతో రెండో స్థానంలో ఉండగా, రికార్డు బ్రేక్ చేయడానికి కేవలం 8 పరుగులు అవసరమయ్యాయి. తన ఇన్నింగ్స్ ఆరంభంలోనే రెండు ఫోర్లు, రెండు సింగిల్స్‌తో ఈ మార్కును సులభంగా దాటేసింది. తాజా రికార్డుతో మంధాన 171 ఇన్నింగ్స్‌లలో 4,788 పరుగులతో అగ్రస్థానానికి చేరుకుంది. ఈ జాబితాలో మంధాన, సూజీ బేట్స్ (4,758) తర్వాత పురుషుల టీ20ల్లో అగ్రగామిగా ఉన్న పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజం (4,596) మూడో స్థానంలో ఉన్నాడు. వీరి తర్వాత జోస్ బట్లర్ (4,292), భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (4,287) వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నారు. ఈ రికార్డుతో మంధాన పురుషుల క్రికెట్‌లోని అగ్రశ్రేణి ఆటగాళ్లను కూడా వెనక్కి నెట్టడం విశేషం.

ఇక ఆసియా క్రీడల సెమీఫైనల్ విషయానికొస్తే, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. 2023లో జరిగిన హాంగ్‌జౌ గేమ్స్‌లో స్వర్ణ పతకం గెలుచుకున్న భారత జట్టు, ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉంది. అంతకుముందు క్వార్టర్‌ఫైనల్‌లో ఆతిథ్య జపాన్‌ను ఓడించి సెమీస్‌కు చేరుకుంది.

షఫాలీ శతక విధ్వంసం.. బంగ్లా బేజారు.. సూపర్ విక్టరీతో ఫైనల్‌కు భారత్

హైదరాబాద్ పెన్ పవర్: ఆసియా క్రీడల మహిళల క్రికెట్‌లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. యువ ఓపెనర్ షఫాలీ వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగి అద్భుత శతకంతో కదం తొక్కడంతో సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ 114 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించి, పతకాన్ని ఖాయం చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్టు, బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన బంగ్లా బౌలర్లపై విరుచుకుపడ్డారు. కేవలం 28 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో మంధాన 16 బంతుల్లో 27 పరుగులు చేసి ఔటైనా, పవర్ ప్లే ముగిసేసరికి భారత్ వికెట్ నష్టానికి 72 పరుగులతో పటిష్ఠ స్థితిలో నిలిచింది.

మరోవైపు షఫాలీ తన జోరును కొనసాగించింది. కేవలం 24 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకుని బంగ్లా బౌలింగ్‌ను చీల్చి చెండాడింది. అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో జతకలిసిన షఫాలీ, మరో కీలక భాగస్వామ్యాన్ని నిర్మించింది. వీరిద్దరూ కలిసి 50 పరుగులకు పైగా జోడించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలో షఫాలీ తన విధ్వంసక ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తూ కేవలం 49 బంతుల్లోనే అజేయ శతకాన్ని పూర్తి చేసుకుంది. ఆమె ఇన్నింగ్స్‌లో 9 భారీ సిక్సర్లు, 3 ఫోర్లు ఉన్నాయి. 204.08 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన షఫాలీ చివరి వరకు క్రీజులో నిలిచింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 33 బంతుల్లో 40 పరుగులతో ఆమెకు అండగా నిలవడంతో, భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగుల భారీ స్కోరు సాధించింది.

196 పరుగుల భారీ లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్, ఆరంభం నుంచే తీవ్ర ఒత్తిడికి గురైంది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. పవర్ ప్లే ముగిసే సమయానికే 39 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత కూడా బంగ్లా ఇన్నింగ్స్ ఏ దశలోనూ కోలుకోలేదు. భారత బౌలర్లు విజృంభించడంతో 9 ఓవర్ల తర్వాత 49 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. చివరకు 15.4 ఓవర్లలో కేవలం 81 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో భారత జట్టు 114 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్లో అడుగుపెట్టింది. ఈ అద్భుత ప్రదర్శనతో భారత జట్టు స్వర్ణ పతకంపై కన్నేసింది.

మహేష్ ఇంకో 17 రోజులే.. ఆ తర్వాత జక్కన్న నుంచి విముక్తి!

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్-వరల్డ్ చిత్రం 'వారణాసి' పై ప్రస్తుతం సర్వత్రా ప్రజల్లో ఆసక్తి నెలకొంది. మహేష్ బాబు కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించి తాజా అప్‌డేట్స్ సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేస్తున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన వారణాసి షెడ్యూల్ అక్టోబర్ మొదటి వారానికల్లా పూర్తిగా ముగియనుందని సమాచారం. ఈ భారీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంలో సూపర్ స్టార్ మహేష్ బాబుకి సంబంధించిన కీలకమైన పోర్షన్స్ అన్నీ కేవలం వారంలోనే పూర్తికానున్నట్లు తెలుస్తోంది. రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ గ్రాండ్ స్కేల్ ఎంటర్‌టైనర్‌ను 7 ఏప్రిల్ 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. చెప్పిన తేదీ ప్రకారం రావాలంటే పోస్ట్ ప్రొడక్షన్ పనుల్ని వేగంగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇకపై ఎలాంటి ఆలస్యం లేకుండా జక్కన్న నిర్మాణానంతర పనులపై దృష్టి సారిస్తారని కూడా తెలుస్తోంది. సినిమా కంటెంట్ మ్యాటర్ కి వస్తే.. ఈ చిత్రంలో వారణాసి నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు అత్యంత కీలకం కానున్నాయి. పురాతన నగర వాతావరణం, ఆధ్యాత్మికతతో పాటు రాజమౌళి మార్క్ విజువల్స్ ఈ షెడ్యూల్‌లో ప్రధాన ఆకర్షణగా చిత్రీకరిస్తున్నారు. కేవలం రియల్ లోకేషన్స్ మాత్రమే కాకుండా.. సినిమాలోని అత్యున్నత విజువల్ ఎఫెక్ట్స్ కోసం భారీ సెట్లను సైతం చిత్ర యూనిట్ ఉపయోగించినట్లు సమాచారం. ఇక 'వారణాసి' షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న తర్వాత సూపర్ స్టార్ మహేష్ బాబు చేయాల్సిన తదుపరి చిత్రంపై కూడా ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయి. రాజమౌళి సినిమా తర్వాత మహేష్ బాబు ఎవరి దర్శకత్వంలో నటిస్తారనే దానిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. టాలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం పలువురు టాప్ డైరెక్టర్లు మహేష్ కోసం కథలతో సిద్ధంగా ఉన్నారు. మరోవైపు 'వారణాసి' సినిమాకు సంబంధించిన బిజినెస్ డీలింగ్స్ కూడా ఇప్పటికే పీక్స్‌కు చేరాయి. రాజమౌళి బ్రాండ్ ఇమేజ్, మహేష్ బాబు గ్లోబల్ మార్కెట్ కారణంగా ఈ సినిమా నాన్-థియేట్రికల్ రైట్స్, ఓవర్సీస్ హక్కులు , శాటిలైట్ డీల్స్ అన్నీ కూడా రికార్డు స్థాయి ధరలకు అమ్ముడవుతున్నట్లు ట్రేడ్ వర్గాల్లో భారీ చర్చ నడుస్తోంది. ఇండియన్ సినిమా హిస్టరీలోనే బిగ్గెస్ట్ బిజినెస్ జరిగే ప్రాజెక్ట్‌లలో ఒకటిగా ఇది నిలవనుంది. తాజా సమాచారం మేరకు మహేష్ బాబు ఇంకో 17 రోజుల పాటు చిత్రీకరణను పూర్తి చేస్తే.. ఆ తర్వాత జక్కన్న నుంచి విముక్తి లభించినట్టేనన్న చర్చ సాగుతోంది!

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965